PRGI NO : TGTEL/26/A2002

EDITOR: PEMBI MAHENDHAR

# నవగీతం

NAVAGEETAM DINAPATHRIKA

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 60 | పేజీలు : 8 | ఆదివారం 26 జూలై 2026 | వెల : 4/-



PRGI.NO.TGTEL/26/A2002

నవగీతం

తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

నవగీతం తెలుగు దినపత్రిక లో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రం లోని అన్ని జిల్లాలో నియోజకవర్గ ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను. ఆసక్తి గలవారు సంప్రదించండి.

Cell: +919912484184

Email: navageetamnews@gamil.com

Website: www.navageetam.com


# దిగొచ్చిన కేంద్రం

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా



- 'విద్యార్థుల భవిష్యత్తే ముఖ్యం'.. తీవ్రంగా బాధపడ్డా: ధర్మేంద్ర
- నాలుగు దశాబ్దాలుగా విద్యా రంగంతో అనుబంధం
- నైతిక బాధ్యత వహిస్తూ పదవి నుంచి తప్పుకున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి

నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీస్తున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. నీట్ యూజీ పరీక్షలో చోటుచేసుకున్న అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ ఆ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. తన రాజీనామా లేఖను ప్రధాని నరేంద్ర మోదీకి పంపినట్లు ఎక్స్ వేదికగా తెలిపారు. నీట్ లీకేజీపై విద్యార్థుల ఆందోళనలు, ప్రతిపక్షాల విమర్శలు కొనసాగుతున్న సమయంలో ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా రాజకీయంగా కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. కేంద్ర మంత్రులతో జరిగిన చర్చల్లో కాక్రోచ్ జనతాపార్టీ ప్రతినిధులు విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని ప్రధాన డిమాండ్‌గా పెట్టినట్లు సమాచారం. ఆ డిమాండ్ల నేపథ్యంలోనే ఈ పరిణామం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. రాజీనామా అనంతరం ధర్మేంద్ర ప్రధాన్ స్పందిస్తూ, తనకు వ్యక్తిగత ప్రతిష్ఠ కంటే విద్యార్థుల భవిష్యత్తే ముఖ్యమని స్పష్టం చేశారు.

2



## 'మేం సాధించాం ఇది విద్యార్థుల విజయం'

- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై సీజేపీ హర్షం
- జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు సంబరాలు
- ప్రజాస్వామ్యం విజయమంటూ విపక్షాల స్పందన

2

## ప్రధాన్ రాజీనామాను స్వాగతిస్తున్నా



- విద్యావ్యవస్థ పునర్నిర్మాణంలో ఇది తొలి అడుగు
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను స్వాగతించిన రాహుల్‌గాంధీ
- దేశవ్యాప్తంగా విద్యార్థుల పోరాటం చూసి గర్విస్తున్నామని వెల్లడి

2



## ఇందిరమ్మ ఇళ్ల కోసం కాల్ సెంటర్

- ఇందిరమ్మ ఇళ్ల సందేహాల నివృత్తికి ప్రత్యేక కాల్ సెంటర్
- 040-24603572 హెల్ప్‌లైన్‌ను ప్రారంభించిన మంత్రి పొంగులేటి
- దరఖాస్తుకు ఆధార్ ఒక్కటే చాలు, ఇతర పత్రాలు అవసరం లేదు
- ఇల్లు రాకపోతే రూ.10 వేల డిపాజిట్ వెనక్కి వస్తుంది
- లబ్ధిదారుడు రూ.6 లక్షలు చెల్లిస్తే చాలు, ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ
- ఇల్లు రాకపోతే అదే ఖాతాకు తిరిగి చెల్లిస్తామన్న మంత్రి పొంగులేటి

హైదరాబాద్

ప్రజాప్రభుత్వంలో క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ టవర్స్‌పై వస్తున్న సందేహాల నివృత్తికి ప్రత్యేక కాల్ సెంటర్ హెల్ప్‌లైన్‌ను గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. హౌసింగ్ బోర్డు కార్యాలయంలో ప్రారంభించిన హెల్ప్‌లైన్ సెంటర్‌లో పథకంపై ప్రజల్లో ఎలాంటి గందరగోళం, - మిగతా3లో

## దేశ భవిష్యత్ అంతా యువతరానిదే



- జెన్ జీ పోరాటానికి ప్రధాని మోదీ తలవంచారు
- నీట్ పేపర్ లీక్, విద్యార్థులపై లాఠీచార్జీకి నిరసనగా ర్యాలీ నిర్వహించిన కాంగ్రెస్
- పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ నేతృత్వంలో ర్యాలీ
- కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, విద్యార్థులు

హైదరాబాద్

చట్టసభలకు పోటీ చేసే వయసును 21 ఏళ్లకు తగ్గించాలని సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామని వెల్లడించారు. నీట్ పేపర్ లీక్ ఘటనతో పాటు ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన అమానుష లాఠీచార్జీని నిరసిస్తూ, విద్యార్థుల ఉద్యమానికి సంఘీభావంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఆధ్వర్యంలో హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరా గాంధీ విగ్రహం వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేశ్? కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు, - మిగతా3లో



## విద్యార్థుల అన్ని డిమాండ్లకు కేంద్రం ఓకే

- ఆందోళనను విరమించిన సీజేపీ
- విద్యార్థులపై క్రమంగా కేసులు ఎత్తివేస్తామన్న ప్రభుత్వం
- ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు అండగా ఉంటామని హామీ
- చర్చలు సఫలంతో ఆందోళన విరమించాలని సీజేపీ నిర్ణయం



## వ్యవస్థీకృత నేరాలపై ఉక్కుపాదం!

- ప్రజా పరీక్షల బిల్లుకు మరింత పదును
- ఇకపై పేపర్ లీకైతే 10 ఏళ్ల జైలు, రూ.50 లక్షల జరిమానా!
- ప్రశ్నా పత్రాల లీక్, పరీక్షల్లో అక్రమ పద్ధతులు, మోసాలకు పాల్పడిన వారికి ఐదేళ్ల నుంచి గరిష్ఠంగా 10 ఏళ్ల జైలుశిక్ష
- సర్వీస్ ప్రొవైడర్లపై జరిమానాను రూ. కోటి నుంచి రూ.5 కోట్లకు పెంపు

## ఆన్‌లైన్ గేమ్‌లు ఆడేవారి బ్యాంకు అకౌంట్స్ క్లోజ్!

- సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తులే కారణం
- మ్యూల్ ఖాతాల స్థానే సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తులు
- గేమింగ్ సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటున్న నేరగాళ్లు
- లేదంటే అలాంటి కంపెనీల స్థాపన - దోచుకున్న డబ్బు లాభాల పేరుతో మళ్లింపు



నవగీతం
తెలుగు దినపత్రిక
ఆదివారం 26 జూలై 26

# సీజేపీ ఉద్యమంతో దిగొచ్చిన కేంద్రం

నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీస్తున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. నీట్ యూజీ పరీక్షల్లో చోటుచేసుకున్న అవకతవకల కు నైతిక బాధ్యత వహిస్తూ ఆ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. తన రాజీనామా లేఖను ప్రధాని నరేంద్ర మోదీకి పంపినట్లు ఎక్స్ వేదికగా తెలిపారు. నీట్ లీకేజీపై విద్యార్థుల ఆందోళనలు, ప్రతిపక్షాల విమర్శలు కొనసాగు తున్న సమయంలో ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా రాజకీయంగా కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. కేంద్ర మంత్రులతో జరిగిన చర్చల్లో కాక్రోచ్ జనతాపార్టీ ప్రతినిధులు విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని ప్రధాన డిమాండ్‌గా పెట్టినట్లు సమాచారం. ఆ డిమాండ్ల నేపథ్యంలోనే ఈ పరిణామం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. రాజీనామా అనంతరం ధర్మేంద్ర ప్రధాన్ స్పందిస్తూ, తనకు వ్యక్తిగత ప్రతిష్ఠ కంటే విద్యార్థుల భవిష్యత్తే ముఖ్యమని స్పష్టం చేశారు. గత పది రోజులుగా చోటుచేసుకున్న పరిణామాలు తనను తీవ్రంగా బాధించాయని పేర్కొన్నారు. దేశ యువత గందరగోళ పరిస్థితుల్లో చిక్కుకోకుండా చూడాలన్న ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమ చదువుపైనే దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. నీట్ వివాదాన్ని కొన్ని శక్తులు తమ ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే అవకాశం ఇవ్వకూడదని పేర్కొన్నారు. దేశ ఐక్యత, యువత భవిష్యత్తు కాపాడటం అందరి బాధ్యత అని తన రాజీనామా లేఖలో వివరించారు.



తన రాజీనామా లేఖలో ధర్మేంద్ర ప్రధాన్ విద్యా రంగంతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. నాలుగు దశాబ్దాలుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యా సంస్కరణలతో కలిసి పనిచేస్తున్నానని తెలిపారు. బలమైన దేశానికి బలమైన విద్యా వ్యవస్థ పునాది అని తాను ఎప్పుడూ నమ్ముతానని చెప్పారు. నీట్ యూజీ పరీక్షల్లో అక్రమాలు బయటపడిన వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించిందని ప్రధాన్ తెలిపారు. దర్యాప్తును సీబీఐకి అప్పగించడం, పరీక్షను రద్దు చేయడం, తిరిగి పరీక్ష నిర్వహణకు తేదీ ప్రకటించడం వంటి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

**'లక్షలాది మంది విద్యార్థుల ప్రయోజనాలే లక్ష్యం'**

నీట్ పరీక్షకు హాజరైన లక్షలాది మంది విద్యార్థుల ప్రయోజనాలను కాపాడటమే తమ ప్రధాన లక్ష్యమని ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. పరీక్ష వివాదం కారణంగా ఏ ఒక్క ప్రతిభావంతుడైన విద్యార్థి నష్టపోకూడదనే ఉద్దేశంతో పనిచేశానని తెలిపారు. నీట్ ఫలితాల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన పలువురు విద్యార్థులు కూడా మంచి ఫలితాలు సాధించారని చెప్పారు. అయితే కొందరు బాధ్యతాయుత స్థానాల్లో ఉన్న వ్యక్తులు విద్యార్థులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ఆరోపించారు.

**పేపర్ లీక్‌లపై కఠిన చర్యలు**

దేశవ్యాప్తంగా పేపర్ లీక్‌లను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. పేపర్ లీక్‌లను నియంత్రించేందుకు ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసేలా కొత్త చట్టాన్ని తీసుకురావాలని కేంద్రం యోచిస్తోంది. ఇటీవల నీట్ వ్యవహారంపై దేశంలోని పలు ప్రాంతాల్లో విద్యార్థులు నిరసనలు చేపట్టారు. ఢిల్లీ జంతర్ మంతర్ సహా అనేక ప్రాంతాల్లో ఆందోళనలు కొనసాగాయి. విద్యార్థుల న్యాయం కోసం వివిధ సంఘాలు కూడా ఉద్యమించాయి.

**'వచ్చే ఏడాది నుంచి కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామ్'**

నీట్ పరీక్ష నిర్వహణలో మార్పులు తీసుకురావాలని కేంద్రం నిర్ణయించింది. వచ్చే ఏడాది నుంచి నీట్ పరీక్షను కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహించే అంశంపై చర్యలు తీసుకుంటున్నట్లు ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. పరీక్షా విధానంలో పారదర్శకత పెంచడం, అక్రమాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ఈ మార్పులు చేపడుతున్నట్లు చెప్పారు. రాజీనామా లేఖలో ప్రధాని నరేంద్ర మోదీకి ధర్మేంద్ర ప్రధాన్ కృతజ్ఞతలు తెలిపారు. విద్యాశాఖ మంత్రిగా పనిచేసే అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు చెప్పారు. దేశ సేవ తన జీవితంలో అత్యంత ముఖ్యమైన బాధ్యత అని పేర్కొన్నారు.

# ప్రధాన్ రాజీనామాను స్వాగతిస్తున్నా

కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్వాగతించారు. ప్రధాన్ రాజీనామాతో దేశ విద్యావ్యవస్థ పునర్నిర్మాణంలో తొలి అడుగు పడిందని వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు చేసిన పోరాటాన్ని చూసి గర్విస్తున్నామని అన్నారు. వీధుల్లోకి వచ్చి పోరాడిన యువతకు, విద్యార్థులకు ఆయన అభినందనలు తెలియజేశారు. కేంద్ర మంత్రి ప్రధాన్ రాజీనామా చేసినప్పటికీ, మరో రెండు డిమాండ్ మిగిలే ఉన్నాయని రాహుల్ అన్నారు. విద్యార్థులకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలని, నిరసనకారులపై జరిగిన లాఠీఛార్జీపై విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వాన్ని కూల్చేందుకు సమయం అసన్నమైందని రాహుల్‌గాంధీ అన్నారు.

"ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం దేశ విద్యావ్యవస్థ పునర్నిర్మాణంలో కీలక ముందడుగు. ప్రజాస్వామ్యం, దేశ భవిష్యత్తు, రాజ్యాంగ పరిరక్షణ కోసం వీధుల్లోకి వచ్చి పోరాడిన ప్రతి విద్యార్థికి నా అభినందనలు. మిమ్మల్ని చూస్తుంటే నాకు ఎంతో గర్వంగా ఉంది. కేంద్రం చేతిలో దాడులు, అణచివేతకు గురవుతున్న రైతులు, కార్మికులు, పేదలు– ఇలా సమాజంలోని ప్రతి వర్గానికి ఇదొక సంకేతం. ఎదిరించి నిలబడటంలోనే ధైర్యం, విజ్ఞత ఉన్నాయి . భయపడకండి, ఈ ప్రభుత్వాన్ని సాగనంపుదాం. ఇంకా రెండు డిమాండ్లు నెరవేర్చాల్సి ఉంది. మొదటిది : విద్యార్థుల వైపు వేలు లెవనెత్తి, వారిని కొట్టిన ప్రతి ఒక్కరినీ బాధ్యులను చేయాలి. రెండోది : కనీస గౌరవంతో విద్యార్థులకు ప్రధాని మోదీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలి."

**మోదీ ప్రభుత్వానికి మేలుకొలుపు**

ప్రస్తుతం దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన సంక్షోభంలో ఉందని రాహుల్‌గాంధీ అన్నారు. దేశంలో నిరుద్యోగం సంక్షోభస్థాయికి చేరిందని పేర్కొన్నారు. ఒక దేశాన్ని, వ్యవస్థలను నడిపే తీరు ఇది కాదని విమర్శించారు. దేశంలో విద్యా వ్యవస్థ, మీడియా, సమాఖ్య వ్యవస్థలు గాడితప్పాయన్నారు. విద్యార్థుల ఆందోళనలు దేశంలో ఉన్న



తీవ్రమైన సంక్షోభానికి నిదర్శనమని, మోదీ ప్రభుత్వానికి ఇది ఒక మేలుకొలుపు అని పేర్కొన్నారు. ఈ సంక్షోభాలను పరిష్కరించే వరకు కాంగ్రెస్ ఆందోళన కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థులపై జరిపిన అణిచివేతను సోమవారం పార్లమెంటులో ప్రశ్నిస్తామని అన్నారు. విద్యార్థులపై జరిగిన దాడులకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా బాధ్యుడని ఆరోపించారు. అమిత్ షా వైఖరిని పార్లమెంటులో ప్రశ్నిస్తామని రాహుల్ స్పష్టం చేశారు.

**విద్యావ్యవస్థలోకి ఆర్ఎస్ఎస్**

"మన దేశ విద్యావ్యవస్థ గొప్పదని ప్రపంచమంతా పేరుంది. కానీ దీనిని క్రమంగా ప్రైవేటీకరణ చేస్తున్నారు. నిరుద్యోగం పెరగడంతో యువత ఆగ్రహంతో ఉన్నారు. అందుకే విద్యావ్యవస్థ ప్రక్షాళన జరగాలని యువత కోరుకుంటున్నారు. కానీ మన విద్యావ్యవస్థను ఆర్ఎస్ఎస్ ప్రభావితం చేస్తోంది. విద్యా వ్యవస్థలోకి ఆర్ఎస్ఎస్ దొడ్డిదారిన చొరబడి, చెరబట్టింది. అందుకే దేశ విద్యావ్యవస్థను ఆర్ఎస్ఎస్ కబంధహస్తాల నుంచి విముక్తం చేయాల్సిన అవసరం ఉంది. తాజాగా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం, వీరి డిమాండ్లకు కేంద్రం ఒప్పుకోవడం అనేది విద్యార్థుల సాధించిన ఘనవిజయం" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

**యువత దెబ్బకు కదిలిన అధికార పీఠం!**

బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ అధికార పీఠాన్ని యువత కదిలించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. విద్యావ్యవస్థను సరిదిద్దాలని కోరుతూ వీధుల్లోకి వచ్చి గళమెత్తిన లక్షలాది మంది యువత చివరకు విజయం సాధించారని కొనియాడారు. ఈ అవినీతి ప్రభుత్వం కారణంగా తమ బిడ్డలను కోల్పోయిన తల్లిదండ్రులకు ఇది గొప్ప ఊరట అని ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇప్పటికైనా ప్రధాని నరేంద్ర మోదీ యువతరానికి క్షమాపణలు చెప్పాలని ఖర్గే డిమాండ్ చేశారు.

**మా డిమాండ్లకు లిఖితపూర్వక హామీ ఇవ్వాల్సిందే!**

నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ మంత్రి పదవికి రాజీనామా చేసిన తర్వాత, కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ) శనివారం కీలక వ్యాఖ్యలు చేసింది. తమ మూడు డిమాండ్లను తీరుస్తామని లిఖితపూర్వక హామీ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అలాగే ఈ రోజు సాయంత్రం 6 గంటలకు కొవ్వొత్తుల ప్రదర్శన (క్యాండిల్ మార్చ్) నిర్వహించాలని పిలుపునిచ్చింది. ఆ మూడు డిమాండ్లు ఏమిటంటే, 1. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం (ఇది పూర్తయ్యింది.) 2. బలవన్మరణానికి పాల్పడిన నీట్ అభ్యర్థుల కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం చెల్లించాలి. 3. నిరసనకారులపై నమోదైన ఎఫ్?ఐఆర్?లు తక్షణం ఉపసంహరించుకోవాలి. ఈ మూడు డిమాండ్లను తీరుస్తామని లిఖితపూర్వకంగా అంగీకరిస్తే, తాము ఇళ్లకు వెళ్లిపోతామని సీజేపీ ప్రతినిధి అశుతోష్ రంకా పేర్కొన్నారు. ఇక ?కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం అనేది ఒక సాధారణ మానవుడు సాధించిన విజయంగా సీజేపీ ప్రతినిధి అశుతోష్ రంకా అభివర్ణించారు. నీట్ పేపర్ లీకేజీపై విద్యార్థుల నిరసనలు తార స్థాయికి చేరుకున్న నేపథ్యంలో ధర్మేంద్ర ప్రధాన్ శనివారం తన పదవికి రాజీనామా చేశారు. దేశ యువత అయోమయ వలయంలో చిక్కుకోకుండా ఉండేందుకు, విద్యార్థుల విస్తృత ప్రయోజనాలను కాపాడేందుకు రాజీనామా నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. కాగా, ఇది యువత సాధించిన విజయమని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పేర్కొన్నారు.

# వ్యవస్థీకృత నేరాలపై ఉక్కుపాదం!

నీట్ ప్రశ్నపత్రం లీకేజీ దుమారం కొనసాగుతున్న వేళ, పరీక్షల అక్రమాలకు పాల్పడుతున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవడం కోసం కేంద్రం సిద్ధమైంది. పబ్లిక్ ఎగ్జామ్స్ (అక్రమ పద్ధతుల నివారణ) సవరణ బిల్లు–2026ను కేంద్రం రెడీ చేసింది. ఇప్పటికే కేబినెట్ ఆమోదించిన చట్ట సవరణ ముసాయిదా బిల్లును సోమవారమే పార్లమెంటు ముందుకు తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ఈ బిల్లు ప్రకారం, పరీక్షల్లో అక్రమ పద్ధతులను అవలంబిస్తే కనీసం 5 ఏళ్ల నుంచి గరిష్ఠంగా 10 ఏళ్ల వరకు జైలు శిక్ష విధించేలా చట్టంలో మార్పులు ప్రతిపాదించారు. జరిమానాను రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షలకు పెంచేందుకు ప్రతిపాదన చేశారు. సర్వీస్ ప్రొవైడర్స్‌కి విధించే జరిమానాను రూ.1కోటి నుంచి రూ.5 కోట్లకు పెంచుతూ నిబంధన చేర్చారు. పరీక్షల నుంచి సర్వీస్ ప్రొవైడర్స్‌ని నిషేధించే కాలాన్ని 4 ఏళ్ల నుంచి 8 ఏళ్లకు పొడిగిస్తూ ప్రతిపాదనలు చేశారు. ఒక వేళ నేరం రుజువైతే, కంపెనీ డైరెక్టర్లు లేదా ఉన్నతాధికారులకు కనీసం 5 ఏళ్ల జైలు శిక్ష, రూ.5 కోట్ల వరకు జరిమానా విధించను న్నారు. వ్యవస్థీకృత పరీక్షా కుంభకోణాలకు సంబంధించి శిక్ష, జరిమానాల్లో కూడా కేంద్రం మార్పులు ప్రతిపాదించింది. కనీస శిక్షను 5 ఏళ్ల నుంచి 7 ఏళ్లకు, కనీస జరిమానాను రూ.1కోటి నుంచి రూ.10 కోట్లకు పెంచింది. పరీక్షా కుంభకోణాలపై దర్యాప్తు చేయడానికి ప్రత్యేక టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. పోలీసులు, కేంద్ర దర్యాప్తు సంస్థ లేదా టాస్క్ ఫోర్స్ మొత్తం దర్యాప్తును 2 నెలల్లోపు పూర్తి చేసేలా మార్పులు ప్రతిపాదించింది. అంతేకాదు ఇందులో నేరానికి పాల్పడిన సంస్థల ఆస్తుల జప్తు అంశాన్నీ చేర్చింది. ప్రశ్నాపత్రాలు లీక్ చేయడం, ఓఎంఆర్



లను తారుమారు చేయడం, నకిలీ వెబ్?సైట్లు సృష్టించడం, ఫేక్ అడ్మిట్ కార్డులు జారీ చేయడం మొదలైన 15 అక్రమ కార్యకలాపాలకు తాజా బిల్లు వర్తింపజేస్తున్నట్లు సమాచారం.

**ఫాస్ట్ ట్రాక్ కోర్టులు**

రోజువారీ విచారణలు జరపడానికి ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతంలో ప్రత్యేక ఫాస్ట్–ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయనున్నట్లు బిల్లులో పేర్కొంది. ఛార్జ్ షీట్ దాఖలైన 3 నెలల్లోపు విచారణ ప్రక్రియను పూర్తి చేసేలా నిబంధన పెట్టింది. ప్రతిపాదిత సవరణ చట్టం అమలులోకి రాకముందే పెండింగ్‌లో ఉన్న కేసులను కూడా ప్రత్యేక ఫాస్ట్–ట్రాక్ కోర్టులకు బదిలీ చేయాలని నిర్ణయం తీసుకుంది. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించే అధికారాన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కల్పించింది. ఫాస్ట్–ట్రాక్ కోర్టు తీర్పులపై దాఖలయ్యే అప్పీళ్లను హైకోర్టుకు చెందిన ఇద్దరు న్యాయమూర్తుల డివిజన్ బెంచ్ విచారించాలని ప్రతిపాదించింది. వీలైనంత వరకు 3 నెలల్లోపు అప్పీళ్లపై నిర్ణయం తీసుకునేలా నిబంధన పెట్టింది. చట్ట సవరణ బిల్లును సోమవారం పార్లమెంటు ముందుకు తీసుకువచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**ప్రస్తుతమున్న చట్టం ఏం చెబుతోంది?**

పరీక్ష పేపర్ల లీకేజీ, చీటింగ్ నేరాలకు పాల్పడిన వారికి ముడేళ్ల నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష విధించవచ్చు. సంఘటిత నేరానికి పాల్పడిన ముఠాలకు, సంస్థల సభ్యులకు 5ఏళ్ల నుంచి 10 ఏళ్ల జైలు శిక్ష, రూ.1 కోటి జరిమానా వేసే అవకాశం ఉంది. ఈ చట్టం యూపీఎస్?సీ, ఎస్?ఎస్?సీలతోపాటు, నీట్?–యూజీ, జేఈఈ, సీయూఈటీ పరీక్షలకు వర్తిస్తుంది.

**ఉద్యోగుల తొలగింపు**

నీట్ ఆందోళనల నేపథ్యంలో ప్రధానమంత్రి మోదీ అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో నీట్–యూజీ (2026) ప్రశ్నపత్రం లీకేజి వివాదానికి సంబంధించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)లోని 47 మంది సిబ్బందిని ఉద్యోగాల నుంచి తొలగించారు. వీరిలో కొందరిపై చట్టపరమైన, క్రిమినల్ చర్యలు తీసుకోనున్నట్టు అధికారులు తెలిపారు. ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి వినీత్ జోషిని పంచాయతీరాజ్ శాఖకు బదిలీ చేసిన నేపథ్యంలోనే ఈ పరిణామం జరగడం గమనార్హం. దీంతోపాటు ఎన్‌టీఏ అనుసరిస్తున్న ఔట్‌సోర్సింగ్ విధానంలో మార్పులు చేసి, పేపర్ లీకేజికి వీలు లేకుండా చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం.

## మేం సాధించాం.. ఇది విద్యార్థుల విజయం

నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై చేపట్టిన విద్యార్థుల ఆందోళనలతో దిగొచ్చిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. దీంతో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. మరోవైపు ప్రధాన్ రాజీనామాపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) హర్షం వ్యక్తం చేసింది. ఇది విద్యార్థుల విజయమని, ప్రజాస్వామ్యం అంటే ఇదేనని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. మేం దీన్ని సాధించాం. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంలో ఇదే మొదటి రాజీమానా. మనం భయపడకుండా, ఈ ప్రభుత్వానికి తలొగ్గకపోతే ఎవరి చేతనైనా రాజీనామా చేయించగలమనేదానికి ఇదే నిదర్శనం. శాంతియుతంగా చేసే ఏ ఆందోళనతో అయినా లక్ష్యం తప్పకుండా నెరవేరుతుంది. ఈ విషయాన్ని మహాత్మ గాంధీ నుంచి నేర్చుకున్నా. ఈ దేశ యువత శాంతియుత నిరనసలు వృథాగా పోలేదు. విద్యార్థుల పోరాటం ఫలితానిచ్చింది. వారి సత్తా ఏంటో తెలిసింది. ఇది విద్యార్థుల విజయం. ప్రజాస్వామ్యం అంటే ఇదే' అని దీప్కే అన్నారు.

**'మిగిలిన డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమం ఆగదు'**

అయితే తమకు రాజకీయాలు అవసరం లేదని దీప్కే అన్నారు. తమ తీసుకొచ్చిన మూడు డిమాండ్లల్లో ఒకటి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనా చేశారని, మిగిలిన రెండు నెరవేరే వరకు వేచి చూస్తామని తెలిపారు. విద్యార్థులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే విద్యార్థులపై పెట్టిన అన్ని కేసులు పూర్తిగా ఎత్తివేయాలని, ఆత్మహత్య చేసుకున్న వారికి పరిహారం వచ్చే వరకు ఈ ఉద్యమం ఆగదని వెల్లడించారు. శనివారం సాయంత్రం 6.30 గంటలకు కొవ్వొత్తులతో ర్యాలీ చేద్దామని సీజేపీ నేతలు యువతకు పిలుపునిచ్చారు.

**స్పందించిన సోనమ్ వాంగ్‌చుక్**

పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్ చుక్ స్పందిస్తూ, ఇది నేరుగా ప్రజల నుంచి ఉద్భవించిన ప్రజాస్వామ్య విజయమని అన్నారు. భయాన్ని వీడినందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. సీజేపీ, జెన్‌జీకి అభినందనలు తెలుపుతూ ఎక్స్?లో పోస్ట్ చేశారు. జవాబుదారీతనం నుంచి ఇప్పుడు సంస్కరణల దిశగా మారిందని అన్నారు.

**ఇది మోదీ మొండితనానికి పరాజయం : ఖర్గే**

మరోవైపు ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామపై కాంగ్రెస్ కూడా స్పందించింది. ఇది ప్రజాస్వామ్య విజయమని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎక్స్?లో పోస్ట్ చేశారు. విద్యా వ్యవస్థను సరిదిద్దడం కోసం విద్యార్థులు ధైర్యంగా పోరాడారని అన్నారు. ఇది సత్యం సాధించిన విజయమని, ప్రధాని మోదీ మొండితన ఎదుర్కొన్న పరాజయమని అన్నారు. ఇప్పుడు యువతకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాల్సిన వంతు వచ్చిందని, వారిపై లాఠీలు, దండాలు, పెల్లెట్? గన్?లను ప్రయోగించిన వారిపై కఠని చర్యలు తీసుకోవాల్సి బాధ్యత కూడా ఆయనదే అని అన్నారు. విద్యాశాఖ మంత్రి రాజీమానాతో ప్రజాస్వామ్యంలో జవాబుదారీతనం నుంచి నిరవధికంగా తప్పించుకోలేమని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ అన్నారు. విద్యా రంగంలో పారదర్శక సంస్కరణలు, సంస్థాగత బాధ్యత ఉండాలని పిలుపునిచ్చారు.

**ప్రజాస్వామ్యం, యువత విజయం : కేజ్రీవాల్**

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను ఆమ్ ఆద్మీపార్టీ స్వాగతించింది. ఇది విద్యార్థులు, యువత, ప్రజాస్వామానికి లభించిన విజయమని ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ప్రభుత్వం ప్రజల వాణిని వినాలని, పేపర్ లీక్‌లను నివారించడానికి చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నట్లు ఎక్స్?లో వీడియో పోస్ట్ చేశారు. యువత ఉద్యమం కారణంగానే మంత్రి రాజీనామాను ప్రభుత్వం అంగీకరించాల్సి వచ్చిందని ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ అన్నారు. పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా ప్రారంభమైన ఈ ఉద్యమం ఇప్పుడు ఉద్యోగాల కల్పనకు కూడా విస్తరిస్తుందని, ప్రతి తప్పుకు జవాబుదారీతనం ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

## విద్యార్థుల అన్ని డిమాండ్లకు కేంద్రం ఓకే



నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై శనివారం కేంద్రం, కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) మధ్య జరిగిన చర్చలు ఎట్టకేలకు సఫలమయ్యాయి. సీజేపీ డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. విద్యార్థులపై పెట్టిన కేసులను క్రమంగా ఎత్తివేస్తామని కేంద్ర మంత్రి జేపీ నడ్డా ప్రకటించారు. ఢిల్లీ, మిగతా రాష్ట్రాల్లో నమోదైన కేసులు ఎత్తివేస్తామని, భవిష్యత్తులోనూ ఎవరినీ కేసులతో వేధించబోమని స్పష్టం చేశారు. అలాగే, బాధిత కుటుంబాలకు పరిహారంపై చర్చించామని, ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో పరీక్షల నిర్వహణ విషయంలో సీజేపీతో చర్చిస్తామని వెల్లడించారు. ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషనల్ క్లబ్‌లో కేంద్రం, సీజేపీ మధ్య జరిగిన మూడో విడత చర్చల్లో కేంద్రమంత్రులు జేపీ నడ్డా, జితేంద్రసింగ్, సీజేపీ ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా పాల్గొన్నారు. సుదీర్ఘ చర్చల అనంతరం సమావేశ వివరాలను సంయుక్తంగా మీడియాకు వెల్లడించారు.

"నాలుగు పాయింట్ల ప్రధాన సారాంశం ఏమిటంటే నిరసనకారులపై ఎలాంటి చర్యలు తీసుకోకూడదు. ఎఫ్ఐఆర్ నమోదు చేయకూడదు. ఒకవేళ ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఉంటే వాటిని ఉపసంహరించుకోవాలి. ఈ కేసులు ఢిల్లీ పోలీసుల ద్వారా నమోదైనా లేదా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడ నమోదైనా సరే ఆ ఎఫ్ఐఆర్ కాపీలను మేము వారికి అందిస్తాం. నిరసనల సమయంలో ఆందోళనకారులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవడానికి, వారిపై ఎలాంటి తదుపరి చర్యలు తీసుకోకుండా ఉండటానికి ప్రభుత్వం అంగీకరించింది. భవిష్యత్తులో కూడా ఆందోళనల నిర్వాహకులు, నిరసనకారులపై ఈ కార్యకలాపాలకు సంబంధించి ఎలాంటి కేసులు నమోదు చేయకూడదని మేము అంగీకరించాం. వారు ప్రస్తావించిన రెండో అంశం పరిహారానికి సంబంధించినది. ఈ పరిహారం చెల్లింపుపై ప్రభుత్వం తన వైఖరిని చాలా స్పష్టంగా తెలియజేసింది. నిబంధనలు లోబడి సాధ్యమైనంత పరిహారాన్ని అందిస్తాం."

**'ఆందోళనకారులు తిరిగి ఇళ్లకు వెళ్లిపోండి'**

మరోవైపు, చర్చలు సఫలం కావడంతో ఆందోళన విరమిస్తున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ ప్రకటించింది. కేంద్రం తమ డిమాండ్లు నెరవేరుస్తామని మంగళవారం నాటికి గ్యారంటీ ఇస్తామని ప్రకటించడంతో ఆందోళనలు విరమిస్తున్నట్లు సీజేపీ ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోశ్? రంకా ప్రకటించారు. మరోవైపు, తమ ఐదు సూత్రాల డిమాండ్ల పత్రాన్ని ప్రభుత్వానికి సీజేపీ ప్రతినిధులు సమర్పించారు. నాలుగు వారాల తర్వాత తదుపరి విడత చర్చలు జరపనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై సీజేపీ ప్రతినిధి అశుతోశ్? రాంకా మాట్లాడారు. "మేము నీట్ బాధితుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం డిమాండ్ చేశాం. అందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఇది కాకుండా విద్యా, పరీక్షా సంస్కరణల గురించి ప్రస్తావిస్తూ ఐదు సూత్రాల డిమాండ్ల పత్రాన్ని కూడా ప్రభుత్వం ముందు ఉంచాం. ఆ డిమాండ్ల పత్రం గురించి సుమారు నాలుగు వారాల్లో మేం ప్రభుత్వాన్ని మళ్లీ కలుస్తాం. డిమాండ్లకు అంగీకారం లభించింది కాబట్టి నిరసనకారులు వెంటనే తమ ఇళ్లకు తిరిగి వెళ్లాలని మేం కోరుతున్నాం" అని అశుతోశ్? పేర్కొన్నారు.

**కేసుల ఉపసంహరణపై ప్రభుత్వ హామీ**

ఇదిలా ఉండగా, సీజేపీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ మాట్లాడుతూ, "కేవలం ఢిల్లీలోనే కాకుండా, ఇతర రాష్ట్రాలన్నింటిలోనూ నిరసనకారులపై దాఖలైన అన్ని ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకోవాలన్నది మా రెండో డిమాండ్. ప్రభుత్వం ఆ డిమాండ్‌ను కూడా అంగీకరించింది. అంతేకాకుండా, ఉపసంహరణ త్వరలోనే జరుగుతుంది. దాఖలైన అన్ని ఎఫ్ఐఆర్‌ల కాపీలను పంచుకుంటామని ప్రభుత్వం మాకు హామీ ఇచ్చింది. మాకు అందిన చివరి సమాచారం ప్రకారం, ఢిల్లీలో 15 నుంచి 20 ఎఫ్ఐఆర్‌లు దాఖలయ్యాయి. ఏది ఏమైనా ఉపసంహరణ త్వరలోనే జరుగుతుందని ప్రభుత్వం హామీ ఇచ్చింది" అని ఆయన పేర్కొన్నారు.

**'ప్రజల హక్కుల రక్షణ భద్రతా దళాలపై ఉంది'**

ఇదిలా ఉండగా, ఢిల్లీలో జరుగుతున్న విద్యార్థుల ఆందోళనల గురించి తమకు తెలుసని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ ప్రతినిధి స్టెఫాన్? డుజారిక్ పేర్కొన్నారు. శాంతియుతంగా నిరసన తెలపాలనుకునే వారిని ఎటువంటి వేధింపులు, అరెస్టులు లేదా గాయాల భయం లేకుండా అనుమతించడం చాలా ముఖ్యమని ఆయన తెలిపారు. ఎక్కడైనా సరే, ప్రజల శాంతియుత నిరసన హక్కులను రక్షించాల్సిన బాధ్యత అక్కడి భద్రతా దళాలపై ఉందని పేర్కొన్నారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
ఆదివారం
26 జూలై 2026

# ఇందిరమ్మ ఇళ్ల కోసం కాల్ సెంటర్

-మొదటిపేజీ తరువాయి

అపోహలు లేకుండా దరఖాస్తు విధానం, అర్హతలు, అవసరమైన పత్రాలు, చెల్లింపులు, కేటాయింపు విధానం తదితర అంశాలపై పూర్తి సమాచారం అందిస్తారని మంత్రి తెలిపారు. ప్రజలు ఎలాంటి సందేహాలు ఉన్నా మధ్యవర్తులను నమ్మకుండా నేరుగా 040-24603572 నంబర్‌కు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య ఫోన్ చేసి అధికారిక సమాచారాన్ని తెలుసుకోవాలని సూచించారు.

**దరఖాస్తుదారుడి నిబంధనలు ఇవే**

దరఖాస్తు దారుల సౌకర్యార్థం తెలుగు , హిందీ, ఇంగ్లీషు, ఉర్దూ భాషలలో సమాచారం తెలియజేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నుంచి సరైన సమాచారం అందించేందుకు ఈ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపారు. దరఖాస్తుదారు క్యూర్ పరిధిలో పదేళ్లుగా నివాసం ఉండాలని, దరఖాస్తుదారు లేదా కుటుంబానికి ఓఆర్ఆర్, క్యూర్ పరిధిలో సొంత ఇల్లు లేదా ఫ్లాట్ ఉండకూడదని, ఒక కుటుంబానికి ఒక దరఖాస్తు, ఒక ఫ్లాట్ మాత్రమే కేటాయింపు ఉంటుందని మంత్రి వివరించారు.

**ఆన్‌లైన్ పోర్టల్, వాట్సప్ ద్వారా దరఖాస్తు**

క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా తొలి విడతలో 16 నియోజకవర్గాలలో 7680 ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతున్నామని, ఏ నియోజకవర్గానికి చెందిన ప్రజలు అదే నియోజకవర్గంలో



దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. దరఖాస్తు దారులు ఎలాంటి విష ప్రచారాలను నమ్మకూడదని మీ సేవ కేంద్రాలు, ఆన్‌లైన్ పోర్టల్,వాట్సప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

**చెల్లింపునకు యూపీఐ లేదా నెట్ బ్యాంకింగ్**

హైదరాబాద్ క్యూర్ ఏరియా ప్రాంతంలో నివసిస్తున్న అల్పాదాయ వర్గాల కుటుంబాల కోసం ఈ పథకాన్ని రూపొందించామని తెలిపారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షల వరకు ఉండాలని, ఒక కుటుంబం నుంచి ఒక దరఖాస్తు మాత్రమే స్వీకరించి అర్హత కలిగిన కుటుంబానికి ఒక ఫ్లాట్? మాత్రమే కేటాయిస్తారని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. అందిన దరఖాస్తులను డిజిటల్ విధానంలో పరిశీలించడంతో పాటు, క్షేత్రస్థాయి పరిశీలన, సమగ్ర ధృవీకరణ నిర్వహిస్తామన్నారు. నిర్మిస్తున్న ఫ్లాట్ల సంఖ్య కంటే అర్హులైన దరఖాస్తుదారుల సంఖ్య ఎక్కువగా ఉంటే, పారదర్శకమైన విధానంలో లాటరీ ద్వారా ఇళ్లను కేటాయిస్తామని తెలిపారు.

**ఇల్లు మంజూరు కాకపోతే డబ్బులు వాపసు**

దరఖాస్తు సమయంలో రూ.10 వేలు చెల్లింపునకు యూపీఐ లేదా నెట్ బ్యాంకింగ్‌ను మాత్రమే ఉపయోగించాలని, ఒక వేళ ఇల్లు మంజూరు కాకపోతే తిరిగి అదే ఖాతాకు ఆ మొత్తం వాపసు అవుతుందన్నారు. పరిశీలన, కేటాయింపు, వాపసు తదితర సమాచారం పూర్తయ్యేవరకు మీసేవ రశీదు, చెల్లింపు రశీదు, దరఖాస్తు సంఖ్య, మొబైల్ నంబర్‌లను యాక్టివ్‌గా ఉంచుకోవాలని మంత్రి సూచించారు.

రూ.5 లక్షల సబ్సిడీతో స్థలం : ఈ పథకం కింద ప్రతిపాదించిన ఫ్లాట్లు ఒక బెడ్‌రూమ్, హాల్, కిచెన్‌తో సుమారు 525 చదరపు అడుగుల విస్తీర్ణంతో నిర్మిస్తున్నామని తెలిపారు. ఒక్కో ఫ్లాట్ ఖరీదు రూ.40-60 లక్షల వరకు ఉంటుందని, ఇందులో ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీతో పాటు అన్ డివైడెడ్ షేర్ కింద 20-25 గజాల స్థలాన్ని కూడా లబ్దిదారుని పేరిట రిజిస్ట్రేషన్ చేపడుతుందన్నారు. లబ్దిదారుడు కేవలం రూ.6 లక్షలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్, హౌసింగ్ బోర్డు సీఈ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ గేమ్‌లు ఆడేవారి బ్యాంకు అకౌంట్స్ క్లోజ్!

మీరు ఆన్‌లైన్లో గేమ్ ఆడుతున్నారా మీ బ్యాంకు అకౌంట్‌ఏ క్షణం అయినా నిలిచిపోయే ప్రమాదం ఉందని నిపుణలు హెచ్చరిస్తున్నారు. ఎందుకంటే సైబర్ నేరగాళ్లు దోచుకున్న నగదును తెలివిగా ఇలాంటి అకౌంట్?లోకి మళ్లిస్తున్నారు. పోలీసుల దర్యాప్తులో ఇలా జమ అయిన నగదు సైబర్ నేరానికి సంబంధించినదని తేలుతుండటంతో ఆ అకౌంట్‌లను స్తంభింపజేస్తున్నారు. మ్యూల్ అకౌంట్‌లను కాపాడుకునేందుకు సైబర్ నేరగాళ్లు వేస్తున్న ఈ కొత్త ఎత్తుకు గేమింగ్ ఆడుతున్న వారు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ మధ్యకాలంలో ఇలాంటి వందల అకౌం ట్‌లు గుర్తించిన పోలీసులు వీటిపై చర్యలు తీసుకోవాల్సిందిగా జాతీయ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్‌కు రాశారు.

**సైబర్ నేరగాళ్ల కొత్త మార్గం**

తెలంగాణలో సైబర్ నేరగాళ్లు సగటున రోజుకు రూ.4 కోట్ల వరకూ కొల్లగొడుతున్న సంగతి తెలిసిందే. మాయమాటలతో బోల్తా కొట్టించి బాధితుల బ్యాంకు అకౌంట్‌లోని నగదు మాయం చేస్తుంటారు. మ్యూల్ అకౌంట్‌లను ఆ డబ్బును మళ్లిస్తుంటారు. దేశవ్యాప్తంగా రెండు సంవత్సరాల కాలంలో పోలీసులు సుమారు 25 లక్షల మ్యూల్ అకౌంట్‌లను స్తంభింపజేశారు. గత సంవత్సరం తెలంగాణలో 4,775 గుర్తించారు. ఈ సంవత్సరం ఫిబ్రవరిలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి తెలంగాణలో 1,888 మ్యూల్ అకౌంట్?లు స్తంభింపజేశారు. భవిష్యత్తులో అసలు ఇలాంటి అకౌంట్?లే దొరికే అవకాశం లేదన్న ఉద్దేశంతో సైబర్ నేరగాళ్లు నూతన మార్గం కనిపెట్టారు.

**నేరగాళ్లు కొట్టేసిన నగదు**

పలు రాష్ట్రాలు ఆన్‌లైన్ గేమింగ్‌ను నిషేధించారు. కానీ ఆన్‌లైన్ గేమింగ్‌కు పూర్తిగా అడ్డుకట్ట పడలేదు. అందుకే ఇతర దేశాల్లో ఉన్న సైబర్ నేరగాళ్లు ఇలాంటి గేమింగ్



కంపెనీలను నెలకొల్పడమో, ఇప్పటికే ఉన్న వాటితో ఒప్పందం కుదుర్చుకోవడమో చేస్తున్నారు. ఆన్‌లైన్ గేమ్ ఆడుతున్న వారికి లాభం వచ్చినప్పుడు సైబర్ నేరగాళ్లు తాము దోచుకున్న నగదును వారి అకౌంట్?లో జమ చేస్తున్నారు. గేమ్ ఆడేవారికి ఇది వారు ఆట ఆడినందుకు వచ్చిన లాభంగానే కనిపిస్తుంది. అంటే గేమింగ్ సంస్థ ఇవ్వాల్సిన లాభాన్ని సైబర్ నేరగాళ్లు ఇస్తున్నారు.

గేమింగ్ సంస్థలతో వారు ఇలాంటి ఒప్పందం చేసుకుంటున్నారు. ఈ విషయం ఆన్‌లైన్ గేమ్ ఆడుతున్న వారికి తెలియదు. ఈ మధ్యకాలంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు దర్యాప్తులో భాగంగా నేరగాళ్లు కొట్టేసిన నగదు తాలూకూ అకౌంట్?లను పరిశీలిస్తున్నప్పుడు ఇలాంటి వ్యవహారం బయటపడింది. సైబర్ నేరాలతో తమకు సంబంధం లేదని, ఆన్‌లైన్ ఆటలు ఆడినందుకు వచ్చిన లాభం తమ అకౌంట్?లో పడిందని వారు అంటున్నారు. దీనిపై లోతుగా దర్యాప్తు జరిపినప్పుడు అసలు విషయం బయటపడింది. తెలిసినా, తెలియక పోయినా సైబర్‌నేరం తాలూకూ నగదు ఖాతాలో జమ అయిందంటే ఆ అకౌంట్‌ను స్తంభింపజేసే అధికారం పోలీసులకు ఉంటుంది.

**అకౌంట్ స్తంభించిపోయే ప్రమాదం**

: ఈ ఏడాది ఇప్పటికే ఇలాంటి అకౌంట్‌లను కొన్ని వందలు గుర్తించామని పోలీసు అధికారులు తెలిపారు. ఈ అకౌంట్‌లను స్తంభింపజేయాలని జాతీయ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్‌కు సిఫార్సు చేశారు. ఆన్‌లైన్ ఆటలు ఆడితే బ్యాంకు అకౌంట్ స్తంభించిపోయే ప్రమాదం ఉందని పోలీసులు వెల్లడించారు.

# అంచనాలకు ఓకే - బిల్లులు మాత్రం పనులు చూశాకే

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల్లోని 4 ప్యాకేజీలకు సవరించిన అంచనాలకు మంత్రివర్గం ఆమోదం లభించినా బిల్లులు పాస్ చేసే ముందు పనికి సంబంధించిన వివరాలను నిర్ధారించుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. థర్డ్ పార్టీతో పరిశీలింపజేసి, హై పవర్ కమిటీ ఆమోదం తర్వాత గుత్తేదారుకు చెల్లించాలని ఆదేశించింది. ప్రతి పనిని గుత్తేదారు చేశారా? లేదా నిర్ధారించుకోవడం, జాప్యానికి కారణం గుత్తేదారుది కాదు అని రూఢీ చేసుకోవడం సహా పలు నిబంధనలతో తాజాగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు నీటి పారుదల శాఖ కార్యదర్శికి అంతర్గత మెమో పంపారు. రెండు రోజుల క్రితం పంపిన ఈ మెమో నీటి పారుదల శాఖలో సంచలనం సృష్టించింది.

**జీవో-94లో మార్పులు చేసేందుకు కమిటీ నియామకం**

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పనులకు సంబంధించి చెల్లించే బిల్లులపై సర్కారు మరింత పారదర్శకంగా ముందుకెళ్తోంది. కాంట్రాక్టు ఒప్పంద నిబంధనలు, టెండర్ ప్రక్రియ, పనుల్లో జాప్యం, పెరుగుతున్న వ్యయం ఇలా అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని మూడు దశాబ్దాల క్రితం జారీ చేసిన జీవో-94లో మార్పులు చేసేందుకు ఇటీవలే ఉన్నత స్థాయి కమిటీని ప్రభుత్వం నియమించింది. తాజాగా సవరించిన అంచనాకు ఆమోదం తెలిపినా, గుత్తేదారుకు బిల్లుల చెల్లింపులో నిబంధనలు మరింత కఠినతరం చేస్తూ నిర్ణయం తీసుకొంది.

**కొన్ని కారణాల వల్ల జాప్యం**

పాలమూరు నుంచి రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని 7, 11, 15, 17వ ప్యాకేజీల సవరించిన అంచనాలకు ఈ నెల 17న జరిగిన మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది. దీనివల్ల ఖజానాపై అదనంగా రూ.2,353.38 కోట్ల భారం పడింది. 2016లో ఈ నాలుగు ప్యాకేజీల పనులకు ఒప్పందం జరగ్గా, భూ సేకరణలో ఆలస్యం, ఎన్జీటీలో కేసులు తదితర కారణాల వల్ల తీవ్ర జాప్యం జరిగింది. పదేళ్లైనా ఇంకా పనులు పూర్తి కాలేదు. ఒప్పందం ప్రకారం జరగకపోవడంతో పెరిగిన ధరల వర్తింపు, అదనంగా పని చేయాల్సి రావడం, జీఎస్టీతో సహా పెరిగిన పన్నుల భారం వల్ల భారీగా అంచనాలు పెరిగాయి.



**నీటి పారుదల శాఖను ఆశ్చర్యపరిచిన నోట్**

రెండేళ్లుగా ఆర్థిక, నీటి పారుదల శాఖల చుట్టూ తిరిగిన తర్వాత సవరించిన అంచనాలకు మంత్రివర్గం ఆమోదం లభించింది. ఇందులో ఏదుల వద్ద ఉన్న వీరాంజనేయ రిజర్వాయర్ నుంచి వట్టెం వద్ద ఉన్న వెంకటాద్రి రిజర్వాయర్‌కు నీటిని తీసుకెళ్లే మార్గంలోని సొరంగానికి సంబంధించిన ఏడో ప్యాకేజీలో రూ.918 కోట్లు పెరిగింది. వెంకటాద్రి రిజర్వాయర్‌లో మట్టికట్ట నిర్మాణానికి సంబంధించిన 11వ ప్యాకేజీలో 682.75 కోట్లు పెరిగింది.

కురుమూర్తిరాయ రిజర్వాయర్ మట్టికట్ట నిర్మాణానికి సంబంధించిన 15వ ప్యాకేజీలో 491.85 కోట్లు, ఉదండాపూర్ రిజర్వాయర్ మట్టి కట్ట నిర్మాణానికి సంబంధించిన 17వ ప్యాకేజీలో రూ.260.78 కోట్లు పెరిగింది. ఈ పెంపునకు మంత్రివర్గ ఆమోదం లభించడంతో ఇక మిగిలింది బిల్లుల చెల్లింపే అని నీటి పారుదల శాఖ భావించింది. అయితే చెల్లింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రధాన కార్యదర్శి నుంచి వచ్చిన నోట్ నీటి పారుదల శాఖను ఆశ్చర్యపరిచింది.

**సీఎస్ ఆదేశాలతో నీటి పారుదల శాఖ మల్లగుల్లాలు**

అదనంగా చేయాల్సి వచ్చిన పని, చేసిన పనిని సంబంధిత ఇంజినీర్లు నిర్ధారించి పంపడం, రాష్ట్ర స్థాయి స్టాండింగ్ కమిటీ, హైపవర్ కమిటీ ఆమోదం లభించగానే చెల్లించే వారు. ఇప్పుడు చేసిన పనిని నిర్ధారించుకొన్న తర్వాతనే బిల్లులు చెల్లించాలని సీఎస్ స్పష్టం చేశారు. మళ్లీ పెరుగుదల లేకుండా నిర్దిష్ట కాలంలో పనిని పూర్తి చేస్తామని గుత్తేదారు నుంచి అండర్ టేకింగ్ తీసుకొని అనుబంధ ఒప్పందం చేసుకోవాలని సూచించారు. కాంట్రాక్టు నిబంధనల ప్రకారం జాప్యానికి కారణం గుత్తేదారుది కాదన్న నిర్ధారణ జరిగిన చోటే చెల్లించాలని, పన్నులు, డ్యూటీలు ఎక్కడైతే వర్తిస్తాయో అక్కడే ఇవ్వాలని పేర్కొనడంతో పాటు మళ్లీ హైపవర్ కమిటీ ఆమోదం తీసుకోవాలని సూచించారు. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఈ కమిటీకి ఛైర్మన్‌గా ఉంటారు. తాజాగా సీఎస్ నుంచి వచ్చిన ఆదేశాలతో ఏం చేయాలన్న దానిపై నీటి పారుదల శాఖ మల్లగుల్లాలు పడుతోంది.

## దేశ భవిష్యత్ అంతా యువతరానిదే

-మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ నాయకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, జెన్ జీ పోరాటానికి ప్రధాని మోదీ తలవంచారని వ్యాఖ్యానించారు. మోదీ తలవంచి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించారని పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై తాము పోరాడతామని విద్యార్థులు సందేశం ఇచ్చారని తెలిపారు. దేశ భవిష్యత్ అంతా యువతరానిదే నని, యువత బాగుంటేనే దేశం బాగుంటుందని వెల్లడించారు. కేంద్రం ఝులిపించిన లాఠీఛార్జీలు, తూటాలు యువతను భయపెట్టలేదని సీఎం వ్యాఖ్యానించారు.

**ఆ క్రెడిట్ రాజీవ్‌గాంధీకే**

ఓటుహక్కును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించింది రాజీవ్‌గాంధీ అని సీఎం గుర్తుచేశారు. 21 ఏళ్లకే స్థానికసంస్థల పాలకులుగా మారే అవకాశం పీవీ కల్పించారని చెప్పుకొచ్చారు. కొన్ని దేశాల్లో 18, 21 ఏళ్లకే ఎంపీలు, దేశాధ్యక్షులు కావొచ్చని స్పష్టం చేశారు. ఇదే తరహాలో మనదేశంలోనూ ఎంపీ, ఎమ్మెల్యేలుగా యువతకు అవకాశం రావాలని ఆకాంక్షించారు. దేశంలోనూ చట్టసభలకు పోటీ చేసే వయసు తగ్గించాలని తెలిపారు. 21 ఏళ్లకే ఎమ్మెల్యేగా పోటీ చేసేలా అసెంబ్లీలోనూ తీర్మానం చేస్తామని సీఎం వెల్లడించారు. ఆ అంశంపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామని స్పష్టం చేశారు. ఆగస్టు మొదటి వారం సమావేశంలోనే అసెంబ్లీలో తీర్మానం చేస్తాన్నారు. రాహుల్ ప్రధాని అయితే చట్టసభలకు పోటీ చేసే వయసు 21 ఏళ్లకు తగ్గుతుందని పేర్కొన్నారు. దేశంలో 30 శాతం ఉన్న యువత చట్టసభలకు వెళ్లాలని సీఎం ఆకాంక్షించారు.

**కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించాం**

ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగించేలా ఈ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు వేలాది మంది విద్యార్థులు ఈ ఉద్యమంలో పాల్గొని తమ ఐక్యతను చాటారని పేర్కొన్నారు.

**విద్యార్థి లోకం ఏకమైంది**

దేశంలో ఏకఛత్రాధిపత్యం పాలనకు, కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా యావత్ విద్యార్థి లోకం ఏకమైందని అన్నారు. నీట్ వంటి కీలక పరీక్షను కూడా పారదర్శకంగా నిర్వహించలేని దుస్థితిలో కేంద్ర ప్రభుత్వం ఉందని విమర్శించారు. దేశ సరిహద్దుల్లో చైనా చొరబాట్లను అడ్డుకోవడంలోనూ కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. విద్యార్థుల ఆగ్రహం, ప్రజా ఉద్యమం ముందు కేంద్ర ప్రభుత్వం తలవంచి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. దిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జీని యావత్ దేశం ముక్తకంఠంతో ఖండించిందన్నారు.

కొండగల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వరంగల్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలతో పాటు టీపీసీసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు సంఘీభావ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. "జెన్ జీ పోరాటానికి ప్రధాని మోదీ తలవంచారు. మోదీ తలవంచి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించారు. ప్రభుత్వ వైఫల్యాలపై తాము పోరాడతామని విద్యార్థులు సందేశం ఇచ్చారు. దేశ భవిష్యత్ అంతా యువతరానిదే, యువత బాగుంటేనే దేశ బాగుంటుంది. కేంద్రం ఝులిపించిన లాఠీఛార్జీలు, తూటాలు యువతను భయపెట్టలేదు"

## ఈ సర్కారు బడిలో అడ్మిషన్ ఫుల్ బోర్డు హాట్‌కేక్‌లా మారిన సీట్లు




ప్రస్తుత పరిస్థితుల్లో తల్లిదండ్రులు తమ పిల్లలకు నాణ్యమైన విద్య కోసం కార్పొరేట్ స్కూళ్లను ఆశ్రయిస్తారు. ఆ స్కూళ్ల గేట్లపై నో సీట్స్ అంటూ వేలాడదీసిన బోర్డులను చూసి నిరాశతో వెనుదిరుగుతారు. అలాంటి పరిస్థితి ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో కనిపిస్తున్నాయి. కొన్నేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల వైపు చూడని తల్లిదండ్రులు ఇప్పుడు ఆ పాఠశాలల్లో లభిస్తున్న నాణ్యమైన విద్యపట్ల ఆకర్షితులయి 'ఘర్ వాపస్' మాదిరిగా ప్రైవేటు పాఠశాలల నుంచి తీసుకొచ్చి ప్రభుత్వ బడుల్లోను చేర్పిస్తున్నారు. ప్రభుత్వ స్కూళ్లల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థుల సంఖ్య పెరిగిపోవడంతో తమ పాఠశాలలో సీట్లు లేవంటూ నో బోర్డును తగిలిస్తున్నారు. ఇలాంటి పరిస్థితే తుక్కుగూడ ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ ఫుల్ - నో సీట్స్ అంటూ బోర్డు ఏర్పాటు చేశారు.

**ప్రభుత్వ బడుల్లో సీటు దొరకడమే కష్టం**

అభివృద్ధికి, నాణ్యమైన విద్యకు మన సర్కారు బడులు చిరునామాగా మారుతున్నాయి. ప్రైవేటు పాఠశాలలకు పోటీగా నిలుస్తూ తల్లిదండ్రుల నమ్మకాన్ని గెలుచుకుంటున్నాయి. తాజాగా రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలోని ప్రభుత్వ పాఠశాల అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. పాఠశాల గేటుకు ఏకంగా అడ్మిషన్స్ క్లోజ్డ్ అని బోర్డు పెట్టేంతగా ప్రవేశాలు పెరిగాయి. ప్రభుత్వ బడులంటే ఒకప్పుడు విద్యార్థులు లేక వెలవెలబోయే పరిస్థితి కానీ ఇప్పుడు సీటు దొరకడమే గగనమైపోతోంది.

**184 మంది కొత్తగా ప్రవేశాలు**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ బాలుర ఉన్నత పాఠశాల సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. గత ఏడాది పదో తరగతి ఫలితాల్లో ఏకంగా 91 శాతం ఉత్తీర్ణత సాధించి ఈ పాఠశాల ఆదర్శంగా నిలిచింది. ఇక్కడి ఉపాధ్యాయుల నైపుణ్యం, నాణ్యమైన బోధన నచ్చడంతో పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు క్యూ కట్టారు. గతేడాది పదో తరగతి పూర్తి చేసుకున్న వారితో కలిపి మొత్తం 82 మంది వెళ్లగా వారి స్థానంలో ఏకంగా 183 మంది కొత్తగా ప్రవేశాలు పొందడం విశేషం. ఇందులో ప్రైవేటు పాఠశాలలను వదిలి 50 మందికి పైగా విద్యార్థులు ఈ ప్రభుత్వ పాఠశాలలో చేరడం ఇక్కడి విద్య ప్రమాణాలకు నిదర్శనంగా నిలుస్తోంది. మా పాఠశాలలో గతేడాది 450 మంది విద్యార్థులు ఉండేవారు.టెన్త్? క్లాస్?లో 82 మంది పాస్ అవుట్? అవ్వగా ఈ సంవత్సరం 183 అడ్మిషన్స్? అయ్యాయి. నేటికి 511 అడ్మిషన్స్? అయ్యాయి. ప్రైవేట్? పాఠశాలల నుంచి దాదాపు 50 మంది విద్యార్థులు చేరారు. గత సంవత్సరం మన పాఠశాలలో ఓ అబ్బాయికి 600లకు 570 మార్కులతో ఐఐటీ రావడం జరిగింది. 500 మార్కులు సాధించిన వారిలో 10 మంది విద్యార్థులు ఉండటం మా పాఠశాలకు చాలా గర్వ కారణం. ఇదంతా మా స్కూల్? టీచర్స్ ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ తీసుకోవడం వల్లే సాధ్యమైంది. విద్యార్థులు 91 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది అడ్మిషన్స్ బాగా పెరిగాయి. 511 ఆడ్మిషన్స్ రావడం వల్ల నో అడ్మిషన్స్ బోర్డు కూడా ఏర్పాటు చేశాం'

**నాణ్యమైన విద్య, క్రమశిక్షణనే లక్ష్యంగా**

తమ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య భారీగా పెరగడంతో ఉన్న 15 మంది ఉపాధ్యాయులు 6 నుంచి 10వ తరగతి వరకు ఎ, బి సెక్షన్లుగా విభజించి బోధన అందిస్తున్నారు. కాగా ఇక ఏ తరగతిలోనూ సీట్లు ఖాళీ లేకపోవడంతో పాఠశాల గేటు వద్ద 'అడ్మిషన్స్ క్లోజ్డ్' అంటూ ఫ్లెక్సీ బోర్డును ఏర్పాటు చేశామని ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ రెడ్డి తెలిపారు. మా పాఠశాలలో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, క్రమశిక్షణ అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఉపాధ్యాయుల కృషి, నాణ్యమైన బోధన వల్లే తల్లిదండ్రుల నుంచి ఈ స్థాయిలో ఆదరణ లభిస్తోందని వివరించారు.

# సంపాదకీయం

## విద్యావ్యవస్థలో సంస్కరణలు అవసరం

"ఒక దేశ నాశనానికి అణుబాంబులు కానీ, సుదూర క్షిపణులు కానీ అవసరం లేదు. విద్యా వ్యవస్థ ప్రమాణాలను తగ్గించి, విద్యార్థులను పరీక్షల్లో మోసం చేయడానికి అనుమతిస్తే చాలు.. ఆ దేశం తనంతట తానే కూలిపోతుంది."దక్షిణాఫ్రికాలోని ఒక ప్రముఖ విశ్వవిద్యాలయ ప్రవేశ ద్వారం వద్ద పెద్ద అక్షరాలతో ఈ సత్యం రాసి ఉంటారు. సరిగ్గా ఈ కొటేషన్ మన దేశంలో నేడు చోటుచేసుకుంటున్న పరంపరలకు అద్దం పడుతోంది. దొరికినవాడే దొంగ.. దొరకనంత వరకు అందరూ దొరలే అన్నట్లుగా తయారైంది మన దేశంలోని పోటీ పరీక్షల తీరు. నీట్ ప్రవేశ పరీక్ష పేపర్ లీకేజీ ఉదంతం దేశవ్యాప్తంగా లక్షల మంది విద్యార్థులలో, వారి తల్లిదండ్రులలో సృష్టించిన ఆగ్రహజ్వాలలు ఇంకా చల్లారలేదు. ప్రశ్నాపత్రం లీక్ అయిందని ఆధారాలతో సహా రుజువు కావడంతో దిద్దుబాటు చర్యల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం పరీక్షను రద్దు చేసి, తీవ్ర నిరసనల మధ్య మళ్లీ నిర్వహించింది. అంతవరకు బాగానే ఉంది. కానీ, ఇక్కడ అసలైన ప్రశ్న ఏమిటంటే ఈసారి దొరికింది కాబట్టి లీకేజీ బయటపడింది; మరి దొరకకుండా వెనుక తలకాయలు నడిపిన ముఠాలు, గతంలో జరిగిన పరీక్షల్లో ఎంతటి అక్రమాలకు పాల్పడి ఉంటాయి? భవిష్యత్తులో ఇవి మళ్లీ జరగవని గ్యారెంటీ ఏమిటి?మన విద్యా వ్యవస్థలో పేపర్ లీకేజీలు అనేవి ఒక సాధారణ రుగ్మత గా మారిపోవడం సమగ్ర ప్రజాస్వామ్యానికే పెను ప్రమాద ఘంటిక. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన అత్యున్నత వైద్య విద్యా ప్రవేశ పరీక్ష నీట్ లో చోటుచేసుకున్న అవకతవకలు బయటపడటంతో కేంద్ర ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. కేసు విచారణను సిబిఐ కి అప్పగించడం, దర్యాప్తు సంస్థలు బీహార్, గుజరాత్ సహా పలు రాష్ట్రాల్లో నిందితులను అరెస్ట్ చేయడం, ముఠాల గుట్టు రట్టు చేయడం చరచరా జరిగాయి. హైటెక్ పద్ధతుల్లో వాట్సాప్ గ్రూపులు, సేఫ్ హౌస్‌లలో విద్యార్థులకు సమాధానాలు బట్టీ పట్టించడం వంటి ఘోరాలు వెలుగు చూశాయి. దేశంలో యువతరం రోడ్లపైకి వచ్చింది. లీకేజీల వ్యవస్థపై అసహనం శృతిమించి కాక్రోచ్ పేరుతో సరికొత్త నిరసన ఉద్యమాలు రూపుదిద్దుకున్నాయి. లీకేజీలు, వ్యవస్థాగత లోపాల వల్ల తమ భవిష్యత్తు చీకటిమయమవుతోందన్న ఆవేదన, ఆగ్రహం యువతలో ఏ స్థాయిలో ఉందో ఈ నిరసనల ఉద్ధృతి స్పష్టం చేస్తోంది.మన దేశ పారదర్శకతకు పేపర్ లీకేజీలు కొత్తేమీ కావు. దశాబ్దాల చరిత్రను తిరగేస్తే, ప్రతిష్టాత్మక కేంద్ర, రాష్ట్ర స్థాయి పరీక్షల్లో ఎన్నో సార్లు లీకేజీ ఘటనలు వెలుగు చూశాయి. బయటపడి, రగడ తీవ్రమైనప్పుడు మాత్రమే ప్రభుత్వాలు రద్దు నిర్ణయాలు తీసుకున్నాయి. సమాజం దృష్టికి రాని, ఆధారాలు దొరకని ఎన్నో సందర్భాల్లో అక్రమార్కులు అత్యున్నత ర్యాంకులు పొంది వ్యవస్థలోకి ప్రవేశించి ఉంటారనడంలో ఎలాంటి సందేహమూ లేదు. దీనివల్ల రాత్రింబవళ్లు కష్టపడి చదివిన నిజమైన ప్రతిభావంతులు, నిరుపేద విద్యార్థులు శాశ్వతంగా తమ అవకాశాలను కోల్పోయారు. గతంలో జరిగిన నష్టాన్ని ఇప్పుడు పునరుద్ధరించలేకపోవచ్చు, కానీ భవిష్యత్తు తరాల భవితవ్యాన్ని రక్షించడానికి శాశ్వత, కఠిన కట్టడి చర్యలు వంద శాతం అవసరం. ఎప్పటికప్పుడు తాత్కాలిక ఉపశమానాలు లేదా చిన్నచిన్న కమిటీలతో సరిపెడుతున్న పాలకులు, ఈ వ్యవస్థాగత చీడను తుడిచిపెట్టే శాశ్వత పరిష్కారాల వైపు అడుగులు వేయకపోవడమే అసలు విషాదం. పేపర్ లీకేజీల మహమ్మారి కేంద్ర పరిధిలోని పరీక్షలకే పరిమితం కాలేదు. తెలుగు రాష్ట్రాల్లో వైఫల్యాలు అనేకమంది అభ్యర్థుల జీవితాలను బుగ్గిపాలు చేశాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి ఎంసెట్ లీకేజీలు పదే పదే కలకలం రేపాయి. ముఖ్యంగా 2016 లో తెలంగాణలో జరిగిన ఎంసెట్-2 మెడికల్ పేపర్ లీకేజీ ఘటన దేశాన్నే్గ్భ్రాంతికి గురిచేసింది. ఆల్ ఇండియా స్థాయిలో నెట్‌వర్క్ నడిపి, కోట్ల రూపాయలు వసూలు చేసి ప్రింటింగ్ ప్రెస్ స్థాయి నుంచే పేపర్ లీక్ చేశారు. దీంతో లక్షలాది మంది విద్యార్థులు మళ్లీ పరీక్ష రాయాల్సి వచ్చింది. హైదరాబాద్ కేంద్రంగా రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయంలోనే కంప్యూటర్లు హ్యాక్ చేసి, అంతర్గత సిబ్బంది ద్వారా గ్రూప్-1 ప్రిలిమ్స్, అసిస్టెంట్ ఇంజనీర్ పరీక్షల పేపర్లు లీక్ కావడం అత్యంత భయంకరమైన ఉదంతం. ఏళ్ల తరబడి కోచింగ్ సెంటర్లలో మగ్గిపోయిన నిరుద్యోగ యువత రోడ్లెక్కి ఉద్యమించాల్సి వచ్చింది. ఈ లీకేజీల ఫలితంగా పదే పదే పరీక్షలను రద్దు చేసి మళ్లీ నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది. తరచూ టెన్త్ క్లాస్ బోర్డు పరీక్షల ప్రశ్నాపత్రాలు పరీక్ష ప్రారంభమైన కొద్ది నిమిషాల్లోనే వాట్సాప్ గ్రూపుల్లో ప్రత్యక్షం కావడం, ఉపాధ్యాయులు, కార్పొరేట్ విద్యాసంస్థల ప్రతినిధులు అరెస్ట్ కావడం మనం చూస్తూనే ఉన్నాం. మరోవైపు, ఒకే దేశం ? ఒకే పరీక్ష అనే అతిగా కేంద్రీకృతమైన నినాదం కూడా తీవ్రమైన సమస్యలను తెచ్చిపెడుతోంది. భారత్ లాంటి విభిన్నమైన, విశాలమైన దేశంలో కోట్లాది మందికి ఒకే ఏజెన్సీ ద్వారా ప్రవేశ పరీక్షలను నిర్వహించాలనుకోవడం పరిపాలనాపరంగా అత్యంత ప్రమాదకరమైన ప్రయోగం. దేశంలో ఎక్కడో ఒక మూలన ఉన్న పరీక్షా కేంద్రంలో చిన్న లోపం జరిగినా, లేదా ఒక డిజిటల్ నెట్‌వర్క్ హ్యాక్ అయి పేపర్ బయటకు వచ్చినా.. దేశవ్యాప్తంగా ఉన్న 20 నుండి 25 లక్షల మంది విద్యార్థుల శ్రమ బూడిదలో పోసిన పన్నీరవుతుంది. అంతేకాకుండా, రాష్ట్రాల విద్యా బోర్డుల స్వయంప్రతిపత్తి దెబ్బతిని, ప్రాంతీయ వ్యత్యాసాలు ఉన్న విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది.ప్రజాస్వామ్యంలో నిరసన అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు. అది ప్రభుత్వాల కళ్లు తెరిపించడానికి, వ్యవస్థాగత సంస్కరణలు సాధించడానికి ఉపయోగపడాలి. కానీ, ఆ నిరసనలు ప్రజా ఆస్తుల విధ్వంసానికి, హింసకు దారితీస్తే అది అరాచకత్వానికి దారితీసి, అసలు ఆశయానికే విఘాతం కలిగిస్తుంది.ప్రస్తుతం యువత జరుపుతున్న కాక్రోచ్ ఆందోళనలను , నీట్ నిరసనలను ప్రతిపక్షాలు ప్రత్యేకించి కాంగ్రెస్ వంటి పార్టీలు పూర్తిగా తమ రాజకీయ లబ్ధి కోసం హైజాక్ చేయడానికి ప్రయత్నిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఇది ఉద్యమ స్వభావాన్ని రాజకీయం గా మార్చేస్తోంది. గతంలో కాంగ్రెస్ సుదీర్ఘ పాలన కాలంలో ఏ రకమైన అవినీతి, వ్యూహాత్మక లోపాలు, ప్రశ్నాపత్రాల కుంభకోణాలు జరిగాయో దేశంలో మధ్య వయస్సులో ఉన్న ప్రతి పౌరుడికీ స్పష్టంగా తెలుసు. నాటి యూపీఏ హయాంలో వెలుగుచూసిన దారుణాలు దేశం ఇంకా మరచిపోలేదు.హింసకు, రాజకీయ హైజాకింగ్‌లకు తావివ్వకుండా, ప్రజాస్వామ్య గీత దాటకుండా సాగే వైజ్ఞానిక, చట్టబద్ధమైన పోరాటాలే ఎంతటి మొండి ప్రభుత్వాల మెడలనైనా వంచుతాయి. సమగ్రమైన, శాశ్వతమైన విద్యా సంస్కరణలకు తిరుగులేని బాటలు వేస్తాయి. రాజకీయనాయకుల స్వార్థానికి, అవినీతి ముఠాల అక్రమార్జనకు లక్షలాది మంది ప్రతిభావంతులైన విద్యార్థుల కన్నీళ్లు, నిరుద్యోగుల నిరాశ బలికాకూడదంటే ప్రతి ప్రశ్నా ప్రజాస్వామ్య ఆయుధంగా మారాలి.ప్రశ్నించే గొంతుకలకు స్పష్టమైన కార్యాచరణ తోడైనప్పుడే పాలకులు దిగివస్తారు. రాజకీయాల రంగు పడకుండా, చట్టసభలు చుట్టుముట్టేలా యువత తెచ్చే ఈ మేధో సంచలనమే రాబోయే రోజుల్లో వ్యవస్థలకు అసలైన దిశానిర్దేశం చేస్తుంది. పారదర్శకతకు పట్టంకడుతూ, పేపర్ లీకేజీలు లేని స్వచ్ఛమైన సమర్థ భారత్ ను నిర్మించుకోవడమే మన విద్యా వ్యవస్థకు, కష్టపడే ప్రతిభావంతులైన యువతకు మన సమాజం అందించే అత్యున్నతమైన, అసలైన గౌరవం!

# నీట్ విధానాన్ని పూర్తిగా ఎత్తివేయాల్సిందే!




నీట్ పరీక్ష లీక్ అవడం ఈ ఏడాదే మొదటిసారి కాదు. 2021లో, 2024లోనూ లీక్ అయింది. 2024లో ప్రశ్నపత్రం లీక్ అయినప్పుడు కూడా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) అసమర్థతపైన చాలా చర్చ జరిగింది. ఎన్‌టీఏ నిర్లక్ష్యం, భద్రతా లోపాలపై అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. భవిష్యత్తులో ఇలాంటి లీకేజీలు జరుగకుండా ఉండేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు ఇస్రో మాజీ చైర్మన్ కె.రాధాకృష్ణన్ నేతృత్వంలో నిపుణుల కమిటీని కేంద్రం ఏర్పాటు చేసింది. నీట్ పరీక్ష నిర్వహణపై అధ్యయనం చేసిన ఈ కమిటీ పరీక్ష సక్రమంగా జరగాలంటే మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచిస్తూ ప్రశ్నపత్రాల రవాణా, డిజిటల్ భద్రత, సైబర్ సెక్యూరిటీ, పరీక్ష కేంద్రాల ఎంపిక, డేటా రక్షణ, అభ్యర్థుల ఆధార్ ధృవీకరణ వంటి కమిటీ 10 కీలక విభాగాల్లో సంస్కరణలపై 101 సిఫారసులు చేసింది. నీట్‌ను పెన్ అండ్ పేపర్ విధానంలో కాకుండా కంప్యూటర్ పద్ధతిలో నిర్వహించాలని కీలకమైన ప్రతిపాదన చేసింది. కానీ, కేంద్రం పట్టించుకోలేదు. ఫలితంగా 2026లో మళ్లీ పేపర్ లీక్ అయింది. నీట్ పరీక్ష నిర్వహణే కాదు, అసలు ఈ పరీక్ష విధానాన్ని తీసుకురావడమే ఒక రకమైన వివాదం. ముఖ్యంగా తమిళనాడు రాష్ట్రం నీట్ పరీక్షను సమాఖ్య వ్యవస్థపై దాడిగా మొదటి నుంచీ వ్యతిరేకిస్తూ ఉన్నది. నీట్ రాకముందు మెడికల్ ప్రవేశాలకు దేశవ్యాప్తంగా ఏకీకృత ప్రవేశ పరీక్ష ఉండేది కాదు. అభ్యర్థులు వేర్వేరు ప్రవేశ పరీక్షలు రాయాల్సి వచ్చేది. ప్రతి రాష్ట్రం తమ పరిధిలోని కాలేజీల్లో ప్రవేశాలకు సొంతంగా ప్రవేశ పరీక్షలను నిర్వహించేవి. ఉదాహరణకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎంసెట్, తమిళనాడులో టీఎన్‌సెట్, కర్ణాటకలో కేసెట్.. ఇలా ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం పరీక్షలు నిర్వహించేవి. ఇక అఖిల భారత కోటా 15% సీట్ల కోసం ఏఐపీఎంటీ (ఆలిండియా ప్రీ మెడికల్ టెస్ట్) ఉండేది. అలాగే ఎయిమ్స్, జిప్మర్ వంటి సంస్థలు, కొన్ని ప్రైవేట్ మెడికల్ కాలేజీలు, డీమ్డ్ యూనివర్సిటీలు సొంత ప్రవేశ పరీక్షలను నిర్వహించేవి. 'ఒకే దేశం-ఒకే ప్రవేశ పరీక్ష' అనే నినాదంతో కేంద్రం నీట్ పరీక్షను తీసుకువచ్చింది. అయితే, దీనివల్ల విద్యార్థులు 10-15 వేర్వేరు పరీక్షలు రాయాల్సి వస్తున్నదని, ఇన్ని పరీక్షలకు ఫీజులు చెల్లించడం విద్యార్థులకు కష్టంగా ఉండేది. అలాగే వేర్వేరు నగరాల్లో సెంటర్లు పడితే, అక్కడికి వెళ్లి పరీక్ష రాయడం ఇబ్బందికరంగా మారేది. అలాగే ఒక్కో ప్రవేశ పరీక్షకు ఒక్కో సిలబస్ ఉండటం వల్ల విద్యార్థులు తీవ్ర ఒత్తిడి లోనయ్యేవారు. నీట్ పరీక్ష అంత సులభంగా ఏమీ అమల్లోకి రాలేదు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా 2010లో జాతీయ స్థాయిలో ఒకే ప్రవేశపరీక్ష ప్రతిపాదన తీసుకువచ్చింది. ఆ తర్వాత మూడేండ్లకు 2013 మే 5న దేశంలో తొలిసారిగా నీట్ పరీక్ష నిర్వహించారు. కానీ న్యాయపరమైన చిక్కుల వల్ల అది రద్దయింది. నీట్‌ను వ్యతిరేకిస్తూ ప్రైవేట్ మెడికల్ కాలేజీలు, కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టుకు వెళ్లాయి. విచారణ జరిపిన అప్పటి సీజేఐ అల్తమస్ కబీర్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం 2013 జులై 18న 2:1 మెజారిటీతో నీట్‌ను రద్దు చేసింది. దేశవ్యాప్తంగా ప్రైవేట్ కాలేజీలు, రాష్ట్రాల రాజ్యాంగ హక్కులపై ఒకే పరీక్షను రుద్దే అధికారం ఎంసీఐకి లేదు అని పేర్కొంది. దీంతో 2014, 2015లలో పాత విధానమే కొనసాగింది. ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే 2015లో కూడా ఈ మెడికల్ ఎంట్రెన్స్ ప్రశ్నపత్రం లీక్ అయింది. పరీక్షను మళ్లీ నిర్వహించాల్సి వచ్చింది.

నీట్‌ను రద్దు చేయాలన్న త్రిసభ్య ధర్మాసనం తీర్పుపై కేంద్ర ప్రభుత్వం, ఎంసీఐ దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ ఎ.ఆర్.దవే నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం 2016 ఏప్రిల్ 11న 2013 నాటి తీర్పును రద్దు చేసింది. పాత తీర్పులో సరైన చర్చ జరగలేదని, వైద్య విద్యలో పారదర్శకత ముఖ్యమని పేర్కొంటూ నీట్ విధానాన్ని పునరుద్ధరించింది.

నీట్ వల్ల జాతీయ స్థాయిలో పోటీకి విద్యార్థులకు ఒకే వేదిక ఉంటుందని, మెరిట్ విద్యార్థులకు మేలు జరుగుతుందని భావించారు. కానీ, వాస్తవంలో అలా జరుగలేదు. ఎందుకంటే నీట్ సిలబస్ పూర్తిగా ఎన్సీఈఆర్టీ/సీబీఎస్ఈ ఆధారితంగా ఉంటుంది. పలు రాష్ట్రాల్లో, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో సిలబస్ వేరు. బోధన కూడా చాలా వరకు ఆయా రాష్ట్రాల స్థానిక భాషల్లో ఉంటుంది. పిల్లలను సీబీఎస్ఈ స్కూళ్లలో చేర్పిద్దామా అంటే చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. అందుకు సరిపడా స్కూళ్లు కూడా లేవు. ఇందువల్ల విద్యార్థులకు నష్టం జరిగింది.

నీట్‌కు ముందు ప్రతిష్టాత్మక విద్యా సంస్థలు, ప్రైవేట్ కాలేజీలు మేనేజ్‌మెంట్ కోటా పేరుతో ఒక్కో విద్యార్థి నుంచి రూ.లక్షల్లో డొనేషన్లు వసూలు చేసేవి. ఈ పరిస్థితుల్లో మెరిట్ ఉన్న విద్యార్థులకు నీట్ వల్ల మేలు జరుగుతుందని పలువురు భావించారు. వైద్య విద్యాప్రమాణాలు దేశమంతటా ఒకేలాగా ఉంటాయని ఆశించారు. కానీ నీట్ వల్ల రాష్ట్ర ప్రభుత్వ స్టేట్ బోర్డుల్లో చదివిన గ్రామీణ విద్యార్థులు నష్టపోయారు. పేద విద్యార్థుకు నీట్ పరీక్ష చాలా ఇబ్బందిగా మారింది. ప్రత్యేకంగా కోచింగ్‌లకు వెళ్లాల్సిన పరిస్థితి మరింతగా పెరిగింది. ఇది విద్యార్థుల్లో ఒత్తిడి ఎక్కువయింది. కోచింగ్ ఫీజులు చెల్లించగలిగే వాళ్లకు, పట్టణ ప్రాంత విద్యార్థులకు ఎక్కువగా నీట్‌లో ర్యాంకులు రాసాగాయి. తమిళనాడు ప్రభుత్వం వేసిన ఏకే రాజన్ కమిటీ కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. అందుకే నీట్‌ను రద్దు చేయాలని తమిళనాడు రాష్ట్రం మొదటి నుంచీ డిమాండ్ చేస్తున్నది. రాజ్యాంగంలో 'విద్య' అనేది ఉమ్మడి జాబితాలో ఉన్నది. ఆరోగ్య రంగం రాష్ట్ర పరిధిలోకి వస్తుంది. నీట్ వల్ల రాష్ట్రాల్లోని మెడికల్ కాలేజీల సీట్ల భర్తీపై కేంద్రానికి (ఎన్టీఏ) పూర్తి ఆధిపత్యం లభించినట్టయింది. ఇది సమాఖ్య విధానానికి విరుద్ధమని పలు రాష్ట్రాలు వాదిస్తున్నాయి. తమ ప్రజల పన్నుల డబ్బుతో నిర్మించిన మెడికల్ కాలేజీల్లో ప్రవేశాలను కేంద్రం చేతుల్లో పెట్టడానికి సమ్మతించబోమని అభ్యంతరం తెలుపుతున్నాయి. వీటన్నింటికి తోడు ఉత్తరాది రాష్ట్రాల్లోని సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులు నీట్ పరీక్ష విధానంపై అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. నీట్‌లో ఆలిండియా కోటాలో ర్యాంక్ సాధించి, తెలంగాణలోని మెడికల్ కాలేజీల్లో సీట్లు పొందిన విద్యార్థులు ఇక్కడివారితో పోటీ పడలేక పోతున్నారు. చదువులో అంత వెనుకబడి ఉన్నవారు ఆలిండియా కోటాలో ర్యాంకులు ఎలా సాధిస్తున్నారన్న ప్రశ్నలూ వెల్లువెత్తుతున్నాయి.

తెలంగాణలో రికార్డ్ స్థాయిలో 10 వేలకు పైగా ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ కాలేజీల్లో 4,400 సీట్లు, ప్రైవేట్ కాలేజీల్లో 5,850 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో స్థానిక విద్యార్థులకు 85%, ఆలిండియా కోటాలో ఇతర రాష్ట్రాల విద్యార్థులకు 15 శాతం సీట్లు ఉంటాయి. అంటే మన రాష్ట్రంలోని కాలేజీల్లోని 660 సీట్లను ఆలిండియా కోటాలో ఇతర రాష్ట్రాల విద్యార్థులకు కేటాయిస్తున్నారు. మరి ఈ మేరకు తెలంగాణ విద్యార్థులు ఆలిండియా కోటాలో వేరే రాష్ట్రాల్లోకి వెళ్తున్నారా..? నీట్ వల్ల మన రాష్ట్ర విద్యార్థులకు ప్రయోజనం ఉన్నదా? అంటే అంతగా ఏమీ లేదు. జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక విద్యా సంస్థలను వదిలేసి వేరే రాష్ట్రాల్లోని మెడికల్ కాలేజీల్లో విద్యను అభ్యసిస్తున్న తెలంగాణ విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉన్నది. ఇక ప్రైవేట్‌లోనూ 50 శాతం స్థానిక కోటా ఉంటుంది. వెరసి ఇక్కడి విద్యార్థులు ఇక్కడే చదువుకుంటున్నారు. నీట్ వల్ల మన విద్యార్థులకు పెద్దగా ఒనగూరే ప్రయోజనం ఏమీ లేదు.

నీట్‌పై రాష్ట్రాల అభ్యంతరాలు, లీకేజీల సమస్య, అర్హత లేని ఉత్తరాది విద్యార్థులు కూడా లీకులు, ఇతర బలవంతపు చర్యలతో ఆలిండియా ర్యాంకులు సాధిస్తున్నారన్న అనుమానాలు విమర్శల నేపథ్యంలో, ముఖ్యంగా తాజాగా జరుగుతున్న విద్యార్థి ఉద్యమాన్ని దృష్టిలో పెట్టుకొని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మెడికల్ ఎంట్రెన్స్ పరీక్షలో సంస్కరణ చర్యలు చేపట్టాలి. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం ఉన్న దేశం. అందుకే రాష్ట్రాల్లోని ప్రత్యేక పరిస్థితులను కేంద్రం పరిగణనలోకి తీసుకోవాలి. రాష్ట్ర వైద్య కళాశాలలకు రాష్ట్ర ప్రవేశ పరీక్షలు నిర్వహించే విధానాన్ని కేంద్ర చట్టం ద్వారా పునరుద్ధరించాలి. ఆలిండియా కోటా సీట్లకు, ప్రతిష్టాత్మక విద్యాసంస్థలకు అన్నింటికీ కలిపి ఒకే ప్రవేశపరీక్ష ఉండేలాగా చర్యలు తీసుకోవచ్చు. జాతీయ ప్రమాణాలు, రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి అనేవి పరస్పర వైరుధ్యాలు కావు. నాణ్యమైన వైద్యవిద్యా, సమాన అవకాశాలు, సామాజిక న్యాయం, సమాఖ్య స్ఫూర్తి లక్ష్యాలను సమన్వయం చేసే సమతుల్య విధానమే భారతదేశానికి అవసరం. రాజ్యాంగంలో 'విద్య' అనేది ఉమ్మడి జాబితాలో ఉన్నది. ఆరోగ్య రంగం రాష్ట్ర పరిధిలోకి వస్తుంది. నీట్ వల్ల రాష్ట్రాల్లోని మెడికల్ కాలేజీల సీట్ల భర్తీపై కేంద్రానికి (ఎన్టీఏ) పూర్తి ఆధిపత్యం లభించినట్టయింది. ఇది సమాఖ్య విధానానికి విరుద్ధమని పలు రాష్ట్రాలు వాదిస్తున్నాయి. తమ ప్రజల పన్నుల డబ్బుతో నిర్మించిన మెడికల్ కాలేజీల్లో ప్రవేశాలను కేంద్రం చేతుల్లో పెట్టడానికి నిరాకరిస్తున్నాయి.

# నిత్య చైతన్యమే అస్తిత్వానికి శ్రీరామ రక్ష

అస్తిత్వం, ఐడెంటిటీ, ఉనికి, గుర్తింపు ఏవైనా కొద్దిపాటి తేడాలతో అన్నీ సమానార్థకాలే. తెలంగాణ అస్తిత్వం వెనుక ఉన్న చారిత్రక, రాజకీయ నేపథ్యాన్ని నిరంతరం గుర్తుచేసుకోవడం ఎంత ముఖ్యమో, దాన్ని కాపాడుకోవడానికి ఎల్లప్పుడూ జాగృతంగా, చైతన్యంగా ఉండటం కూడా అంతకంటే ముఖ్యం. తెలంగాణ చరిత్రలో మూడు ప్రధాన ఉద్యమ ఘట్టాలు కనిపిస్తాయి. 1952 నుంచి 1956 వరకు జరిగిన గైర్ ముల్కీ గోబ్యాక్ ఉద్యమం. అది హైదరాబాద్ స్టేట్ ఉన్నప్పుడు మొదటి ముల్కీ ఉద్యమం. ఆ తర్వాత 1969లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం పెద్ద ఎత్తున ఉద్యమం వచ్చింది. ఉవ్వెత్తున ఎగిసిపడిన ఆ ఉద్యమంలో 369 మంది అమరులయ్యారు. అనంతరం కేసీఆర్ నాయకత్వంలో జరిగిన మలిదశ ఉద్యమం. అది చాలా శాంతియుతంగా జరిగిన పోరాటం. అమరుల త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం సాకారమైంది. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత మనవాళ్లలో కొందరికి కొంత ఆరామీ- సుకూన్ స్వభావం లేదా 'కామ్ హోగయ చలో' అన్న స్వభావం చోటు చేసుకుంది. 'తెలంగాణ వచ్చేసింది కదా, ఇంకేం కాదులే' అనే నిర్లిప్తత ఆవహించింది. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు చూస్తే ఆ ఆరామీ-సుకూన్ స్వభావం మనల్ని ఎంత ప్రమాదకరమైన స్థితికి తీసుకెళ్లిందో కనిపిస్తున్నది. గతంలో ఏం జరిగిందనేది ఎంత ముఖ్యమో, వర్తమానంలో ఏం జరుగుతున్నది? మనం ఎంత యాక్టివ్‌గా ఉన్నాం? అనేది భవిష్యత్తును నిర్ణయిస్తుంది. ఇప్పుడు నిమ్మళంగా ఉంటే, భవిష్యత్తు అగమ్య గోచరమై మొదటికొచ్చి 'వైకుంఠపాళిలో పెద్ద పాము మింగినట్టు' వెనక్కి పడిపోతాం. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అప్పటి పరిస్థితులను బట్టి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యాలు ఉన్నాయి. 'నీళ్లు, నిధులు, నియామకాలు' అనే నినాదంలో నీళ్లకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి పనులు జరిగాయి. ఉద్యోగాల విషయంలో కూడా 95 శాతం స్థానికులకే వచ్చేలా మార్పులు జరిగాయి. అయినప్పటికీ, ఎక్కడ లోటు జరిగింది అంటే.. తెలంగాణ అస్తిత్వాన్ని, దాని సామాజిక-సాంస్కృతిక వారసత్వాన్ని ఎలా రక్షించుకోవాలనే ప్రణాళికను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లలేకపోయాం. బతుకమ్మ పండుగను అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ వంటి అంతర్జాతీయ వేదికల వరకు తీసుకెళ్లి విస్తృత ప్రచారం కల్పించినప్పటికీ, కేవలం ఆటాపాటలతోనే అస్తిత్వ రక్షణ జరుగదు. ఇప్పుడు మళ్లీ పాత శక్తులు తలలెత్తుతున్నాయి. ఉద్యమ కాలంలో ప్రతి విషయంపైనా ఎంతో క్లారిటీ ఉండేది. కానీ నేడు 'తెలంగాణ ఎక్కడుంది? తెలంగాణ అస్తిత్వం ఎక్కడుంది?' అని ప్రశ్నించే పరిస్థితి తెస్తున్నారు. ఒకవైపు తెలంగాణలోనూ టీడీపీని బలోపేతం చేస్తామని నారా లోకేశ్ అంటుంటే, మరోవైపు పవన్ కల్యాణ్ లాంటి విచిత్రమైన వ్యక్తి ఇక్కడి అస్తిత్వాన్ని సవాల్ చేస్తున్నడు. కాంగ్రెస్ పార్టీ, రేవంత్‌రెడ్డి వైఖరిలోనూ ఇటువంటి నాటకాలే కనిపిస్తున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీరందరికీ ఇక్కడ స్వార్థ ప్రయోజనాలు ఉన్నాయి. ఆంధ్రా ప్రాంత పెట్టుబడిదారులకు, సరిహద్దు ప్రాంతాల వారికి, హైదరాబాద్‌లోనే ఎకరాల భూములు, చెరువులు, కుంటలు ఆక్రమణ చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు, హోటల్ బిజినెస్, సినిమా ఇండస్ట్రీ వంటి వ్యాపారాలు ఉన్నవారి ప్రయోజనాలను రక్షించుకోవడానికే వారు తెలంగాణ ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టే డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారు. ఈ వ్యూహాల వెనుక స్పష్టమైన కుట్ర దాగి ఉన్నది. 'చేపలను పట్టాలంటే మొదట నీటిని కదల్చాలి' తెలంగాణలో భావోద్వేగాలను రెచ్చగొట్టి, హింసను ప్రేరేపించి, తద్వారా ఇక్కడి ప్రాంతీయ శక్తులను (బీఆర్ఎస్‌ను) అణచివేయాలని చూస్తున్నారు. దీని వెనుక నరేంద్రమోదీ డైరెక్షన్ ఉంటే, దానికి చంద్రబాబు, పవన్ కల్యాణ్ బహిరంగ మద్దతు ఇస్తే రేవంత్‌రెడ్డి సైలెంట్‌గా మద్దతు ఇస్తున్నడు. రాబోయే కాలంలో రేవంత్ రెడ్డి తన వర్గంతో కలిసి కాంగ్రెస్‌ను వీడి బీజేపీలోకి వెళ్లినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. ఈ నలుగురి, దుష్ట చతుష్టయం, (మోడీ, చంద్రబాబు, పవన్, రేవంత్) కూటమి తెలంగాణ అస్తిత్వంపై నిశ్శబ్దంగా కుట్రలు చేస్తున్నది. నిన్నటివరకు క్యూబా విప్లవకారుడు చేగువేరా లా మాట్లాడిన పవన్ కళ్యాణ్, నేడు సనాతన ధర్మం అంటూ కాషాయ వస్త్రాలు వేసుకోవడం వారి అవకాశవాదానికి, చిత్ర-విచిత్రమైన రాజకీయ ప్రదర్శనలకు నిదర్శనం. ఇలాంటి శక్తులకు కేవలం ఓటు ద్వారానే బుద్ధి చెప్పాలి, ఒక్క ఓటు కూడా పడకుండా తిరస్కరించాలి. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. సాగునీటికే కాదు తాగునీటికి కూడా ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్లిష్ట సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై రాజకీయాలు మాని నీళ్లను ఎత్తిపోయాలని సాగునీటి నిపుణులు, రిటైర్డ్ ఇంజినీర్లు, రైతాంగం, ప్రధానప్రతిపక్షం బీఆర్ఎస్ విజ్ఞప్తి చేస్తున్నా రేవంత్‌రెడ్డి సర్కార్ మొండిగా వ్యవహరిస్తున్నది. ఆ ప్రాజెక్టుపై ఎన్నికల ముందు చేసిన అసత్య ప్రచారాలనే ఇంకా కొనసాగిస్తున్నది. మోటర్లు ఆన్ చేసి నీళ్లను ఎత్తిపోస్తే వచ్చే నష్టమేమీ లేదని రిటైర్డ్ ఇంజినీర్లు సూచిస్తే వాళ్లపై, విపక్ష పార్టీ నేతలపై పాలకులు వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారు. ఏపీ సీఎం చంద్రబాబు మెప్పు కోసం ఇదంతా చేస్తున్నారని అర్థం చేసుకోవచ్చు. తెలంగాణ అనేది నిన్న మొన్న పుట్టిన పదం కాదు. దీనికి మూడు వేల ఏండ్ల సుదీర్ఘ చరిత్ర ఉన్నది. ఎనిమిదవ శతాబ్దానికి చెందిన ప్రసిద్ధ 'తెల్లాపూర్ శాసనం' లోని స్తంభంపై మొట్టమొద టిసారిగా 'తెలంగాణ' అనే పదం లిఖితపూర్వకంగా చెక్కబడింది. అంతకంటే ముందు, భారతదేశంలోని 16 మహాజన పదాలలో (షోడశ జనపదాలు) ఒకటైన 'అస్మక జనపదం' గోదావరి లోయ ప్రాంతంలోనే విలసిల్లింది. నేటి బోధన్ (పోతలి) దీనికి రాజధానిగా ఉండేది. అలాగే మెట్‌పల్లి-ఖానాపూర్ మధ్య గోదావరి నది ఏడు పాయలుగా చీలే చోట ఉన్న 'బాదనకుర్తి' (బాదనగుర్తి) ద్వీప గ్రామానికి అపారమైన బౌద్ధ చరిత్ర ఉంది. శాతవాహనుల కాలంలో భావరి అనే ఋషి తన శిష్యులను ఇక్కడి నుంచే బుద్ధుని వద్దకు పంపినట్లు ఆధారాలు ఉన్నాయి. ఇంతటి ఘన చరిత్ర ఉన్న తెలంగాణ అస్తిత్వాన్ని ఎవరో వలసవాదులు లేదన్నంత మాత్రాన అది చెరిగిపోదు. రాష్ట్రంలో 30 నెలలుగా పరిణామాలన్నీ చూసిన తర్వాత ఆంధ్రా పెత్తందార్ల, వలసవాదుల కుట్రలను తిప్పికొట్టడానికి తెలంగాణ పౌర సమాజం మళ్లీ సంఘటితం కావాలి. ప్రస్తుతం తెలంగాణలో ఉన్న అస్తిత్వ వేదిక, సోషల్ ఫౌండేషన్ వంటి వాటిని వేదికలుగా చేసుకొని ప్రజలు కలిసికట్టుగా పోరాడాలి. ప్రతి ప్రాంతానికి, సమాజానికి ఒక సామూహిక మనస్తత్వం ఉంటుంది.

నవగీతం
తెలుగు దినపత్రిక

ఆదివారం
26 జూలై 2026

## మంత్రి అడ్లూరికి కీలక బాధ్యత..

ఎస్సీ వర్గీకరణ, రోహిత్ వేముల బిల్లుపై కీలక కమిటీల్లో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు స్థానం..

సామాజిక న్యాయం -- సమాన అవకాశాల దిశగా సీఎం రేవంత్ రెడ్డి మరో ముందడుగు..



**నవగీతం,(జగిత్యాల ప్రతినిధి)** తెలంగాణలో సామాజిక న్యాయాన్ని మరింత బలోపేతం చేయాలన్న ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి సంకల్పానికి అనుగుణంగా, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ని రెండు అత్యంత కీలక కమిటీలలో సభ్యునిగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన (కేబినెట్) శాఖ జి.ఓ.ఆర్.టి. నెం.1077ను ప్రభుత్వం జారీ చేసింది.సుప్రీంకోర్టు ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు నేపథ్యంలో రాష్ట్రంలో చేపట్టాల్సిన చర్యలను అధ్యయనం చేసి ప్రభుత్వానికి సిఫారసులు చేయనున్న ఉన్నతస్థాయి కమిటీలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారిని సభ్యునిగా చేర్చారు. ఎస్సీ వర్గాల సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితులపై సమగ్ర అవగాహన కలిగిన మంత్రిగా ఆయన అనుభవం కమిటీ నిర్ణయాలకు మరింత బలం చేకూర్చనుంది. అదేవిధంగా ఉన్నత విద్యా సంస్థల్లో కుల, సామాజిక గుర్తింపు ఆధారంగా వివక్షను నిరోధించే లక్ష్యంతో రూపొందిస్తున్న రోహిత్ వేముల తెలంగాణ (ఉన్నత విద్యలో గుర్తింపు ఆధారిత వివక్ష నిరోధక) బిల్లు--2026లి" కు సంబంధించిన శాసన రూపకల్పనపై అధ్యయనం చేసి సూచనలు చేయనున్న కేబినెట్ సబ్ కమిటీలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారికి సభ్యత్వం కల్పించింది. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం సామాజిక న్యాయాన్ని పరిపాలనకు కేంద్రబిందువుగా నిలిపిందన్నారు. అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ, సమాన అవకాశాల కల్పన, రాజ్యాంగ స్ఫూర్తి పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశంలో అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, రాజ్యాంగబద్ధమైన, న్యాయసమ్మతమైన సిఫారసులు అందించేందుకు కమిటీ కృషి చేస్తుందని తెలిపారు. అలాగే, ఉన్నత విద్యా సంస్థల్లో విద్యార్థులు ఎలాంటి వివక్షకు గురికాకుండా చట్టపరమైన రక్షణ కల్పించే విధంగా రోహిత్ వేముల బిల్లును ఆదర్శవంతమైన శాసనంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు సామాజిక న్యాయం, సమానత్వం, రాజ్యాంగ విలువల అమలుకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నారని, ఆ దిశలో తీసుకుంటున్న ప్రతి నిర్ణయం తెలంగాణను దేశానికి ఆదర్శ రాష్ట్రంగా నిలబెడుతుందని మంత్రి పేర్కొన్నారు.మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ఈ రెండు కీలక కమిటీలలో సభ్యత్వం కల్పించడం ద్వారా, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్‌ల సంక్షేమానికి సంబంధించిన ప్రభుత్వ విధానాల రూపకల్పనలో ఆయన పాత్ర మరింత బలోపేతం కానుంది.ప్రభుత్వం తీసుకుంటున్న ఈ నిర్ణయం సామాజిక న్యాయం సాధనలో మరో కీలక మైలురాయిగా నిలవనుందని మంత్రి అభిప్రాయపడ్డారు.

## నేరెళ్ల గ్రామంలో పోలీసుల అవగాహన కార్యక్రమం

సీసీటీవీ కెమెరాల ఏర్పాటు ద్వారా గ్రామ భద్రతకు బలోపేతం



**నవగీతం,( ధర్మపురి ప్రతినిధి)** ధర్మపురి మండలం నేరెళ్ల గ్రామంలో శనివారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎ. రాం నర్సింహారెడ్డి, ధర్మపురి సబ్ ఇన్‌స్పెక్టర్ జి. మహేష్ తో కలిసి ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎ. రాం నర్సింహారెడ్డి మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అలాగే డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, సైబర్ నేరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సీసీటీవీ కెమెరాల ప్రాముఖ్యత, వాటి ఉపయోగాలపై ప్రజలకు ఉదాహరణలతో సమగ్రంగా వివరించారు.గ్రామాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా నేరాలను సమర్థవంతంగా నియంత్రించడంతో పాటు ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయవచ్చని తెలిపారు. ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ కాల్స్, అనుమానాస్పద లింకుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే సమీప పోలీసు అధికారులకు సమాచారం అందించాలని కోరారు.గ్రామ సర్పంచ్ కాసారపు బాలగౌడ్ మాట్లాడుతూ గ్రామ ప్రజల సహకారంతో నేరెళ్ల గ్రామంలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపడతామని తెలిపారు. పోలీసు శాఖ సూచించిన భద్రతా చర్యలను గ్రామంలో అమలు చేసేందుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ అవగాహన కార్యక్రమంలో గ్రామస్థులు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొని పోలీసు అధికారులు అందించిన సూచనలు, భద్రతా చర్యలపై అవగాహన పెంపొందించుకున్నారు.

## రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలల సమస్యలు పరిష్కరించడి.



**నవగీతం, మెట్ పల్లి** : తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, శనివారం జగిత్యాల జిల్లా పలు కార్యక్రమాల నిమిత్తం విచ్చేసిన సందర్భంగా కార్యక్రమాలు ముగించుకొని మెట్ పల్లి కి విచ్చేసిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గురుకుల ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గోరుమంతుల సురేందర్ మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో గురుకుల స్కూల్ ప్రారంభమైన అప్పటినుండి నుండి విద్యార్థిని విద్యార్థులకు పలు గురుకుల పాఠశాలలో సరియైన బాత్రూంలు స్థానాల గదులు, మరుగుదొడ్లు, సరిగా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.అలాగే పలు స్కూళ్లలో నీటి సమస్య కూడా చాలా ఎక్కువగా ఉండటం వల్ల విద్యార్థిని విద్యార్థులు రెండు రోజులకు ఒక్కసారి స్నానాలు చేస్తున్నారని, వివరించారు.పలు పాఠశాలల్లో ఇప్పటికీ విద్యార్థులకు చదువుకొనడానికి బుక్స్ కూడా రాలేదు,పలు స్కూల్లలో విద్యార్థిని విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్ కూడా ఇప్పటికీ ఇవ్వలేదు వీటివల్ల విద్యార్థిని విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ కి తెలియజేయడంతో తక్షణమే సోషల్ వెల్ఫేర్ హెడ్ ఆఫీస్ లో మాట్లాడి విద్యార్థులకు న్యాయం చేస్తానని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పొట్ట ప్రసాద్, సోమిడి వినోద్,విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్లే భూ సర్వే కాలేదు..

ఇబ్రహింపట్నం మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కాశీరెడ్డి భాస్కర్ రెడ్డి...




**నవగీతం, (ఇబ్రహీంపట్నం ప్రతినిధి )** రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం,అలసత్వం కారణంగానే పలువురు రైతుల భూముల సర్వేలు సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కాశీరెడ్డి భాస్కర్ రెడ్డి విమర్శించారు.శనివారం మండలంలోని అమ్మకపేట గ్రామంలో నిర్వహించిన భూ సర్వే గ్రామసభలో తహశీల్దార్ వరప్రసాద్ సమక్షంలో మాట్లాడుతూ సర్వే నంబర్లు 48, 49లో జిల్లపల్లి రాజయ్యకు చెందిన 2 ఎకరాల 10 గుంటల భూమి సర్వే కోసం 2023 సంవత్సరం నుంచే మండల సర్వే కార్యాలయం, డివిజన్ సర్వే కార్యాలయాలకు పలుమార్లు దరఖాస్తులు సమర్పించినప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. భూమి సర్వే నిర్వహించాలని పలుమార్లు అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేసినా, చలానాలు చెల్లించినా ఫలితం లేకుండా పోయిందని,రైతులు తమ భూముల హక్కులను కాపాడుకోవడానికి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరమన్నారు. భూమి సర్వే ఆలస్యం కావడం వల్ల రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, భూ వివాదాలు పెరిగి సాగు పనులపై కూడా ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖ అధికారులు ప్రజల సమస్యలను గుర్తించి వేగంగా స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ రీ-సర్వే కార్యక్రమం రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని భాస్కర్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలోని ప్రతి భూమికి స్పష్టమైన హద్దులు నిర్ధారించడంతో పాటు భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. చిన్న, సన్నకారు రైతులకు ఈ కార్యక్రమం ద్వారా న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఇప్పటికైనా అధికారులు పెండింగ్‌లో ఉన్న సర్వే దరఖాస్తులను ప్రాధాన్యతగా తీసుకుని పూర్తి చేయాలని, రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలని కోరారు. గ్రామస్థుల సమక్షంలో జరిగిన ఈ గ్రామసభలో పలువురు రైతులు తమ భూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలాల వెంకట్ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో శాంతిభద్రతలు, నేర నియంత్రణ, పోలీసింగ్ విధానాలపై సమగ్ర సమీక్ష

జగిత్యాల పోలీసుల పనితీరుకు డీఐజీ ప్రశంసలు

జగిత్యాల జిల్లా పర్యటనలో బాసర జోన్ డీఐజీ ఆర్. భాస్కరన్



**నవగీతం, జగిత్యాల ప్రతినిధి:** బాసర జోన్ డీఐజీ ఆర్. భాస్కరన్, శనివారం జగిత్యాల జిల్లాలో పర్యటించారు.ఈ సందర్భంగా జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం (డీపీఓ)తో పాటు జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి జిల్లా పోలీసింగ్ వ్యవస్థ, శాంతిభద్రతల పరిస్థితులు, నేర నియంత్రణ చర్యలు, ప్రజా భద్రత, దర్యాప్తు ప్రమాణాలు, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.ముందుగా జిల్లా పోలీస్ గెస్ట్ హౌస్ కి చేరుకున్న డీఐజీకి జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, స్వాగతం పలికారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించిన డీఐజీ జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి స్టేషన్ రికార్డులు, ఎఫ్ఐఆర్‌లు, కేసు డైరీలు, సీసీటీఎన్ఎస్ నమోదు, స్టేషన్ పరిశుభ్రత, ప్రజలకు అందిస్తున్న సేవల తీరును పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ప్రతి ఫిర్యాదును చట్టపరంగా నమోదు చేసి సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు. దర్యాప్తు నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, శాస్త్రీయ ఆధారాలతో కేసులను విచారించి కోర్టుల్లో శిక్షల శాతం పెంచే విధంగా పనిచేయాలని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్ నిర్వహణలో క్రమశిక్షణ, పారదర్శకత, జవాబుదారీతనం పాటించడం ద్వారా ప్రజల్లో పోలీసులపై మరింత విశ్వాసం పెరుగుతుందని తెలిపారు.ఈ సందర్భం గా పోలీస్ స్టేషన్ ఆవరణం లో మొక్కను నాట్టారు. అనంతరం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి చేరుకున్న డీఐజీ కార్యాలయ పరిసరాలను పరిశీలించి, అక్కడ పనిచేస్తున్న వివిధ విభాగాలను సందర్శించారు. ముఖ్యంగా స్పెషల్ బ్రాంచ్, ఐటీ కోర్, డిస్ట్రిక్ట్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో డీసీఆర్బీ కార్యాలయాలను పరిశీలించి నిర్వహిస్తున్న రికార్డులు, డిజిటల్ డేటా నిర్వహణ, సమాచార సేకరణ విధానం, సాంకేతిక వినియోగం గురించి అడిగి తెలుసుకున్నారు.స్పెషల్ బ్రాంచ్ ద్వారా జిల్లాలో శాంతిభద్రతలకు సంబంధించిన సమాచార సేకరణ, ముందస్తు నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. సామాజిక మాధ్యమాల ద్వారా వ్యాపించే అసత్య ప్రచారాలు, వదంతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి వాటిపై వెంటనే స్పందించాలని ఆదేశించారు.ఐటీ కోర్ విభాగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నేరాల ఛేదనలో సాధిస్తున్న పురోగతిని తెలుసుకున్నారు. సీసీటీవీ విశ్లేషణ, డిజిటల్ ఆధారాల సేకరణ, డేటా అనాలిసిస్, సైబర్ నేరాల దర్యాప్తులో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు.డీసీఆర్బీ కార్యాలయంలో నేర గణాంకాలు, పెండింగ్ కేసులు, వారెంట్‌లు, నిందితుల వివరాలు, నేర విశ్లేషణకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ప్రతి రికార్డు నవీకరించబడేలా చర్యలు తీసుకోవాలని, డేటా ఖచ్చితత్వాన్ని కాపాడాలని అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయం, జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ నిర్వహణ, రికార్డుల మెయింటెనెన్స్ సంతృప్తికరంగా ఉన్నాయని పేర్కొంటూ అధికారులు, సిబ్బందిని డీఐజీ ఆర్. భాస్కరన్, ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.డీఐజీ వెంట జిల్లా ఎస్పీ అశోక్ కుమార్,అదనపు ఎస్పీ చేతన్ నితిన్ ఐపిఎస్ సీఐలు, ఎస్.ఐ సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాజీనామా.

పార్టీలో సరైన గుర్తింపు లేదని అసంతృప్తి.



**నవగీతం,(ములుగు ప్రతినిధి).** ములుగు జిల్లా వాజేడు మండలంలో సీనియర్ నాయకుడి రాజీనామాతో మండల కాంగ్రెస్ పార్టీలో రాజకీయాలు మరొక్కసారి వేడెక్కాయి. గత పది సంవత్సరాలుగా అధికారంలో లేకపోయినా పార్టీని వీడకుండా పనిచేసి అధికారం రావడం కోసం తన వంతు కృషి చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపుకు కృషి చేసినా కూడా పార్టీలో సరైన గుర్తింపు లేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మల్లె దుర్గారావు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా గత ఏడు సంవత్సరాలుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులుగా పని చేశానని తెలియజేశారు. గత కొంతకాలంగా పార్టీలో జరుగుతున్నటువంటి విభేదాలే ఇందుకు కారణమని అన్నారు. అనంతరం ఆయన రాజీనామా లేఖలో ప్రస్తుత కాలంలో సంక్షేమ పథకాల విషయాల విషయంలో గాని పార్టీకి సంబంధించిన విషయాలలో గాని తనకు ఎటువంటి సమాచారం ఇవ్వకపోవడం పార్టీలో సరైన గుర్తింపు ఇవ్వకపోవడం ఇందుకు ప్రధాన కారణమని తెలిపారు. ఇటువంటి విషయాలను గూర్చి పై నాయకత్వానికి పలుమార్లు తెలియజేసినప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవని విసుగుచెంది రాజీనామా చేయక తప్పడం లేదని తెలిపారు. ఇట్టి రాజీనామాను ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ ఆమోదించాలని లేఖలో పేర్కొన్నారు.

## అన్నారుగూడెంలో ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన సదస్సు



**నవగీతం,(తల్లాడ ప్రతినిధి)** ?ఖమ్మం జిల్లా తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గొడ్ల ప్రభాకర్ అధ్యక్షతన ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న బీజేపీ నాయకుడు ఆపతి వెంకట రామారావు మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్టు నీరు అందుతున్నప్పటికీ సిరిపురం మేజర్ కాలువకు నీటి విడుదల కాకపోవడంతో వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని, తక్షణమే సాగునీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ?అలాగే మండలంలోనే అతిపెద్దదైన అన్నారుగూడెం వ్యవసాయ క్లస్టర్‌కు శాశ్వత వ్యవసాయ విస్తరణ అధికారి లేకపోవడం వల్ల ప్రభుత్వ పథకాలు, సాంకేతిక సలహాలు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఇక్కడ ఏఈఓను నియమించాలని కోరుతూ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొమినేని వెంకటేశ్వర్లు, స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు రైతులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు దుస్తుల అందజేత

దుస్తులను పంపిణీ చేసిన వీడీసీ చైర్మన్ మల్యాల సుభాష్ గౌడ్...




నవగీతం, కమ్మర్ పల్లి కమ్మర్ పల్లి వాలీబాల్ అసోసియేషన్ క్రీడాకారుల కు క్రీడా దుస్తులను విడిసి చైర్మన్ మల్యాల సుభాష్ గౌడ్ తన సొంత ఖర్చులతో క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు వీడిసి చైర్మన్ మల్యాల సుభాష్ గౌడ్, మాజీ ఎంపిటిసి మైలారం సుధాకర్ క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. నిజామాబాద్ లో ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యం లో జరుగుతున్న వాలీబాల్ క్రీడల్లో కమ్మర్ పల్లి క్రీడాకారులు పాల్గొనను న్నట్లు తెలిపారు. గతం లో రెండు సార్లు నిజామాబాదు లో జరిగిన వాలీబాల్ క్రీడల్లో కమ్మర్ పల్లి క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి మొదటి బహుమతి గెలుచుకొని విజయం సాధించారు. నిజామాబాదు లో జరిగే వాలీబాల్ క్రీడల్లో విజయం సాధించి కోయంబత్తూర్ లో జరిగే ఫైనల్ మ్యాచ్ కు క్రీడాకారులు వెళ్లేందుకు పూర్తి ఖర్చులను విడిసి చైర్మన్ మల్యాల సుభాష్ గౌడ్ తన సొంత ఖర్చులతో పంపిస్తానని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి మొదటి బహుమతి గెలుపొందలని ఆయన ఆకాంక్షించారు.

## కొడిమ్యాలలో వైభవంగా తొలి ఏకాదశి వేడుకలు

శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, భారీగా తరలివచ్చిన భక్తులు



**నవగీతం,కొడిమ్యాల:** జగిత్యాల జిల్లా కొడిమ్యాల పట్టణంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శయన ఏకాదశి (తొలి ఏకాదశి) పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం అర్చకులు నాగరాజ్ రమేష్ ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకం, అర్చనలు, గోపూజ తదితర విశేష సేవలు నిర్వహించి భక్తులకు దివ్య దర్శనం కల్పించారు.శయన ఏకాదశి రోజున శ్రీమహావిష్ణువు నాలుగు నెలల యోగనిద్రలోకి ప్రవేశిస్తారని, ఈ పవిత్ర కాలాన్ని చాతుర్మాస్య ప్రారంభంగా భావిస్తారని అర్చకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భారీ సంఖ్యలో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఆలయ అర్చకులు నాగరాజు, రమేష్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.కొడిమ్యాలతో పాటు పరిసర గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చి తొలి ఏకాదశి వేడుకల్లో పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఆగస్టు 15 వరకు రోళ్లవాగు ప్రాజెక్టు షెట్టర్ల ఏర్పాటు..

ఆరు నెలల్లో అక్కపల్లి లిఫ్ట్ పనులు పూర్తి..
నక్కల పేట వద్ద మరో కొత్త లిఫ్ట్ ఇరిగేషన్..
ధర్మపురి నియోజకవర్గ ఇరిగేషన్ సమీక్షలో
మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి..




**హైదరాబాద్/ ధర్మపురి:** ఆగస్టు 15వ తేదీ లోపు రోళ్ల వాగు ప్రాజెక్టు షెల్టర్లు ఏర్పాటుచేసి రోళ్ళవాగు ప్రాజెక్టు లో నీటి నిలువ చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ధర్మపురి నియోజకవర్గంలోని ఇరిగేషన్ ప్రాజెక్టుల పై శనివారం హైదరాబాదులో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.
ధర్మపురి నియోజకవర్గంలోని నీటిపారుదల శాఖ ప్రాజెక్టులపై సుదీర్ఘంగా ఇరువురు మంత్రులు అధికారులతో చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలంలో నిర్మిస్తున్న రోళ్ళవాగు ప్రాజెక్టు కు షెల్టర్లు బిగించి ఆగస్టు 15వ తేదీ వరకు 0.25 టీఎంసీల నీటిని నిలువ చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రోళ్ళవాగు ప్రాజెక్టు కాలువల పూడికతీత పనులకు అంచనాల తయారు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ధర్మపురి మండలంలోని అక్కపల్లి లిఫ్ట్ పనులు ఆరు నెలల లోపు పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. 2027 జనవరి చివరి కల్లా అక్కపల్లి ఎత్తిపోతల పథకం నుండి రైతులకు నీటిని అందించే విధంగా పనులు వేగవంతం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. వెల్గటూర్ మండలంలోని జంగల్ నాల ప్రాజెక్టు అభివృద్ధి పనులు, గొల్లపల్లి మండలంలో యశ్వంత్ రావు పేట, రంగధాముని పల్లి చెరువు ఊడిక తీత పనులకు అంచనాలు తయారు చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

**నూతన లిఫ్ట్ ఇరిగేషన్ ప్రతిపాదించిన మంత్రి అడ్లూరి..**

ధర్మపురి మండలంలోని నక్కల పేట గ్రామంలో నూతన లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి సాగునీటిని అందించాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రతిపాదించారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. ధర్మపురి మండలంలో నూతన లిఫ్ట్ ఇరిగేషన్ ప్రతిపాదించడంతో ధర్మపురి మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**సాగునీటి ప్రాజెక్టులకు పూర్తి చేస్తాం.. మంత్రి అడ్లూరి**

ప్రజా ప్రభుత్వంలో ధర్మపురి నియోజకవర్గంలో ని రైతులకు కావాల్సిన సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ కాలంతో కమిషన్ల కొరకు మాత్రమే ప్రాజెక్టుల పనులు చేశారని తాము మాత్రం రైతులకు సాగునీరు అందించాలని లక్ష్యంతో ముందుకు సాగుతూ పనులు పూర్తి చేయడానికి ముందుకు సాగుతుందని మంత్రి అడ్లూరి తెలిపారు.

# ఎమ్మెల్యే రాందాస్ నాయక్ జన్మదిన వేడుకలు

ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షలు



**నవగీతం:వైరా ప్రతినిధి:** వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ జన్మదిన వేడుకలు శనివారం వైరా పట్టణంలో నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో వేలాది మంది కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఉదయం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్న రాందాస్ నాయక్‌కు కట్ల సంతోష్, చెరుకూరి కిరణ్ భారీ గజమాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానిక రింగ్ రోడ్డు నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. పూలవర్షం కురిపిస్తూ ఎమ్మెల్యేను ఊరేగింపుగా తీసుకెళ్లారు. జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఎమ్మెల్యేతో కేక్ కట్ చేయించి సంబరాలు జరిపారు. జన్మదిన వేడుకల్లో భాగంగా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రాందాస్ నాయక్, సుడా చైర్మన్ పువ్వాల దుర్గాప్రసాద్, మార్క్ ఫైడ్ వైస్ చైర్మన్ బోర్రా రాజశేఖర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు , మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, మాజీ మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ తో కలిసి ప్రారంభించారు ఈ సందర్భంగా కట్ల సంతోష్ మాట్లాడుతూ వైరా నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ, తనపై ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు చూపుతున్న ప్రేమాభిమానాలు జీవితాంతం మరువలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ రంగారావు, చెరుకూరి కిరణ్, పమ్మి అశోక్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, తాటిపూడి సర్పంచ్ జవ్వాజి అశ్విని, ఖానాపురం సర్పంచ్ బాలాజీ, కౌన్సిలర్లు మోరు శ్రీకాంత్, ధీరావత్ వెంకటేశ్వర్లు, గోరుంట్ల శ్రీదేవి, బత్తుల సుమతి, నాయకులు గుమ్మ రోశయ్య, రాయల రాము, జవాజి నాగరాజు, మచ్చ బుజ్జి, కట్ల నాగరాజు, తెలుగుదేశం పార్టీ నాయకులు చలపతి, సురేందర్, పూర్ణయ్య, ప్రదీప్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎర్రచందనం స్మగ్లర్లకు సహకరించేవారిని ఉపేక్షించబోం

ఎర్రచందనం అక్రమ రవాణా ముఠాలకు సహకరిస్తే వారు ఎవరైనా సరే, ఎంతటివారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా హెచ్చరించారు. స్మగ్లింగ్‌కు పాల్పడేవారిపై ఉక్కుపాదం మోపుతామని, ఈ వ్యవహారంలో ప్రభుత్వ అధికారుల పాత్ర ఉన్నట్లు తేలితే మరింత కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఎర్రచందనం అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు 'ఆపరేషన్ అరణ్య'ను ఎప్పటికప్పుడు సమీక్షిస్తానని ఆయన తెలిపారు. కడప జిల్లా అవధూత కాశినాయన మండలంలో శనివారం రూ. 1.5 కోట్ల విలువైన 78 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్న ఘటనపై ఆయన అటవీ, పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఈ కేసుకు సంబంధించి ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లతో పాటు వారికి సహకరించిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌ను అరెస్టు చేసినట్లు అధికారులు పవన్ కల్యాణ్‌కు వివరించారు. శనివారం తెల్లవారుజామున వరికుంట్ల గ్రామ సమీపంలో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం, రాష్ట్ర ఇంటెలిజెన్స్ బృందానికి అందిన కచ్చితమైన సమాచారంతో వాహనాలను తనిఖీ చేశారు. ఇంటి సామాగ్రి ముసుగులో బొలెరో మ్యాక్స్ ట్రక్కులో దుంగలను తరలిస్తున్న హర్యానాకు చెందిన సన్నీ, రమేశ్ అనే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. వారి నుంచి వాహనాన్ని, దుంగలను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో భాగంగా, జ్యోతి ఫారెస్ట్ బీట్‌లో పనిచేస్తున్న బీట్ ఆఫీసర్ మల్లికార్జునుడు ఈ ముఠాకు సహకరిస్తున్నట్లు తేలడంతో అతడిని కూడా అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ఈ కేసు వెనుక బెంగళూరు, హర్యానా, కోల్‌కతా కేంద్రాలుగా పనిచేస్తున్న ప్రధాన సూత్రధారులు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ నేపథ్యంలో, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ప్రధాన సూత్రధారులను వెంటనే అరెస్టు చేయాలని పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మల్లికార్జునుడి పాత్రపై సమగ్ర విచారణ జరిపి, నివేదిక సమర్పించాలని సూచించారు.

## జవాబుదారీతనానికి నిదర్శనం

నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారని, ఇది ఎన్డీఏ ప్రభుత్వంలో జవాబుదారీతనానికి నిదర్శనమని వైసీపీ అధినేత జగన్ పేర్కొన్నారు. ఇదే నైతికతను ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్రదర్శించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ పరీక్ష నిర్వహణలో తీవ్రమైన అక్రమాలు జరిగాయని జగన్ ఆరోపించారు. "దాదాపు 3.5 లక్షల మంది టీచర్ అభ్యర్థుల భవిష్యత్తును ఫణంగా పెడుతూ, డీఎస్సీ పరీక్ష నిర్వహణలో జరిగిన అంతులేని అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ, రాష్ట్రంలో అదే ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో విద్యా శాఖ మంత్రిగా ఉన్న నారా లోకేశ్ తన పదవికి రాజీనామా చేస్తారా?" అని ఆయన ప్రశ్నించారు. ఈ అంశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వైఖరిని కూడా జగన్ ప్రశ్నించారు. "ఎన్డీఏ ప్రభుత్వం గొప్పగా చెప్పుకునే ప్రమాణాలు, విలువలు, జవాబుదారీతనానికి పూర్తిగా పాతర వేస్తూ, సీఎం చంద్రబాబు తన కొడుకు పదవిని కాపాడుకుంటారా?" అని నిలదీశారు. జాతీయ స్థాయిలో ఎన్డీఏ పాటిస్తున్న ప్రమాణాలను రాష్ట్రంలో ఎందుకు విస్మరిస్తున్నారని జగన్ తన పోస్టులో ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు

## ఆగస్టు నుంచి 'సంజీవని'..

-మొదటిపేజీ తరువాయి

బాధ్యతను ప్రభుత్వమే స్వీకరించేలా 'సంజీవని'ని తీర్చిదిద్దామని తెలిపారు. ఈ పథకంలో భాగంగా ప్రతి పౌరునికి ఒక డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపొందించి, కుటుంబ సభ్యులందరికీ హెల్త్ ఐడీలు జారీ చేస్తామని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజల ఆరోగ్య సమాచారాన్ని ఒకే వేదికపై అనుసంధానం చేస్తామని వివరించారు. కేవలం వ్యాధి వచ్చాక చికిత్స అందించడమే కాకుండా, వ్యాధులు రాకముందే గుర్తించడం (ప్రెడిక్టివ్), నివారణ చర్యలు చేపట్టడం (ప్రివెంటివ్), అవసరమైనప్పుడు నాణ్యమైన వైద్యం అందించడం (క్యూరేటివ్) అనే త్రిముఖ వ్యూహంతో సంజీవని పనిచేస్తుందని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో 80 లక్షల మంది తీవ్ర వ్యాధులతో బాధపడుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయని, ఈ పరిస్థితిని మార్చేందుకే ఈ ప్రాజెక్టును తీసుకొస్తున్నామని అన్నారు. నాన్ కమ్యూనికబుల్ వ్యాధులు, మాతా-శిశు సంరక్షణ, 108, 104 సేవలు, ఈ-ఔషధి వంటి అన్ని వ్యవస్థలను ఒకే డిజిటల్ గొడుగు కిందికి తీసుకొస్తామని వెల్లడించారు. భవిష్యత్తులో ఏఐ ఆధారిత వైద్య సహాయం, టెలిమెడిసిన్, రిమోట్ కేర్ వంటి సేవలను కూడా ఇందులో భాగం చేస్తామని తెలిపారు.

**సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట**

ప్రజారోగ్యంతో పాటు సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ప్రతి నెలా ఒకటో తేదీనే పెన్షన్లు, అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ. 20 వేలు, తల్లికి వందనం, స్త్రీశక్తి, దీపం-2.0 వంటి పథకాలతో ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో భూ రికార్డుల్లో సృష్టించిన గందరగోళాన్ని సరిదిద్దేందుకు బ్లాక్‌చైన్ టెక్నాలజీతో రీసర్వే చేపడుతున్నామని, వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. 2028 నాటికి కడప స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి, రూ. 1 లక్ష కోట్ల పెట్టుబడులతో రాయలసీమను పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు.

**గత ప్రభుత్వంపై విమర్శలు.. సాగునీటిపై హామీ**

గత ఐదేళ్లలో గొడ్డలి పార్టీ నేతలు ఒక్క ఎకరాకు అదనంగా నీరు ఇవ్వలేదని, ఒక్క పరిశ్రమ తేలేదని చంద్రబాబు విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టులకు పైసా ఖర్చు చేయని వారే ఇప్పుడు

## గ్రామీణ రవాణా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం

మంత్రి సీతక్క
త్వరలో హ్యామ్ రహదారుల పనులు ప్రారంభిస్తాం
సచివాలయంలో హ్యామ్ (ఊంఒ) రోడ్ల పురోగతిపై ఉన్నతస్థాయి సమీక్ష

పట్టణ ప్రాంత రోడ్లకు ఏమాత్రం తీసిపోని రీతిలో గ్రామీణ రహదారుల నిర్మాణాన్ని



వేగవంతం చేస్తున్నామని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి ఆనసూయ సీతక్క స్పష్టం చేశారు. అందుకోసమే అత్యంత ఆధునికమైన హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (ఊంఒ) విధానాన్ని అవలంబిస్తున్నామని చెప్పారు. సచివాలయంలో శనివారం పంచాయతీ రాజ్ శాఖ స్పెషల్ సీఎస్ దానకిషోర్, ఈఎన్సీ జోగారెడ్డి, సీఈలతో కలిపి గ్రామీణ హ్యామ్ రోడ్ల నిర్మాణ పురోగతిపై మంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడూ, ప్రతి గ్రామానికి నాణ్యమైన రోడ్డు కనెక్టివిటీ ఉండాలనేది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్ష అని వెల్లడించారు. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా హ్యామ్ మోడల్‌లో మొత్తంగా 6,703 గ్రామాల్లో 18,472 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపడుతోంది. అందులో మొదటి విడత కింద 2,678 గ్రామాల్లో 7,450 కిలోమీటర్ల మేర రోడ్ల విస్తరణ, పునర్నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు. మొదటి విడుతలో 90 శాతం పనులు ప్రస్తుతం ఉన్న రహదారుల ఆదునీకరణ పనులకే ప్రధాన్యమిస్తున్నామని వెల్లడించారు. దశాబ్దాలుగా రవాణా సౌకర్యం లేని 179 గ్రామాలకు తొలిసారిగా 934 కిలోమీటర్ల మేర బిటి, సిసి రోడ్లను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణలో అమలు చేస్తున్న హ్యామ్ విధానాన్ని దేశమంతా ఆసక్తిగా పరిశీలిస్తున్నందున మార్గదర్శకాలను అత్యంత సమగ్రంగా రూపొందించామని మంత్రి స్పష్టం చేశారు. ఆర్బీఐ అనుమతుల వచ్చే వారంలోగా పూర్తి స్థాయిలో రానున్నాయని, ఆగస్టు 15 నాటికి కాంట్రాక్ట్ అగ్రిమెంట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అగ్రిమెంట్లు కాగానే కాంట్రాక్టర్లు వెంటనే పనులు ప్రారంభించాలని, టెండర్లు దక్కించుకోవడంలో చూపిన ఉత్సాహం పనులు పూర్తి చేయడంలోనూ చూపాలని స్పష్టం చేశారు. పనులను సొంత బాధ్యతగా స్వీకరించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. గతంలో సింగిల్ రోడ్డు ఉన్న చోట కూడా ఇప్పుడు భారీ వాహనాలు వెళ్లేలా నాణ్యతతో రోడ్లను నిర్మించాలని తెలిపారు. పనుల్లో ఆలస్యం లేకుండా భూసమీకరణ, చెట్ల తొలగింపు వంటి అంశాలపై జిల్లా కలెక్టర్లకు తక్షణమే సర్క్యులర్ జారీ చేయాలన్నారు. సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇప్పించాలని, అటవీ భూములు ఉన్న ప్రాంతాల్లో క్షేత్రస్థాయి సమస్యలను స్థానిక అధికారుల సహాయంతో పరిష్కరించుకోవాలని సూచించారు. నిర్మాణంలో ఏవైనా సమస్యలు ఎదురైతే నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని కాంట్రాక్టర్లకు మంత్రి సీతక్క భరోసా ఇచ్చారు.

## నల్లగొండ పట్టణ ప్రగతిలో మరో కీలక ముందడుగు

నార్కట్‌పల్లి - అద్దంకి - మేదరమెట్ల రహదారిపై మర్రిగూడ జంక్షన్ వద్ద నూతనంగా నిర్మించిన ఫ్లైఓవర్‌ను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి రావడంతో నల్లగొండ పట్టణవాసులతో పాటు, ఈ రహదారిపై నిత్యం ప్రయాణించే వేలాది మంది వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. అత్యంత రద్దీగా ఉండే మర్రిగూడ జంక్షన్‌లో రోడ్డు ప్రమాదాలను నివారించి, ప్రజలకు సురక్షితమైన అలాగే వేగవంతమైన ప్రయాణ అనుభవాన్ని అందించడానికి ఈ వంతెన ఎంతగానో ఉపయోగపడుతుంది. మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందనడానికి ఈ ప్రాజెక్టు ఒక ప్రత్యక్ష నిదర్శనం. రవాణా వ్యవస్థను మెరుగుపరచడం ద్వారా నల్లగొండ ప్రాంత ఆర్థిక మరియు వాణిజ్య వృద్ధికి ఈ నూతన ఫ్లైఓవర్ రహదారిని సుగమం చేస్తుంది. ఈ అభివృద్ధి కార్యక్రమం పట్ల ప్రాంతీయ ప్రజలు మరియు ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నా

## ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి,

ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నింటినీ భర్తీ చేయాలి
ఎంపీ వద్దిరాజు డిమాండ్

విద్యార్థులకు బకాయిపడిన 11వేల కోట్ల రూపాయల ఫీజులను వెంటనే చెల్లించాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నింటినీ భర్తీ చేయాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థులు,యువత ఆగ్రహావేశాలకు గురి కాకముందే వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడిన 11వేల కోట్ల ఫీజు రియంబర్స్ మెంట్,స్కాలర్ షిప్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ తెలంగాణ గ్రాడ్యుయేట్స్ ఫోరం శనివారం కొత్తగూడెం కమ్మ సంఘం భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసింది. బీఆర్ఎస్ నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎంపీ రవిచంద్ర ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు,ఆ తర్వాత విలేకరులతో మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యార్థి,యువజన వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. నీట్ ప్రశ్నాపత్రం లీక్ ను నిరసిస్తూ విద్యార్థులు,యువత దేశవ్యాప్తంగా పలుచోట్ల ఆందోళనకు దిగడంతో బెంబేలెత్తిన ప్రధాని నరేంద్రమోడీ మధ్య రాత్రి కూడా స్పందించారని, మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలన చేతకావడం లేదని, విద్యార్థులు, నిరుద్యోగ యువత,ఉద్యోగులు, కార్మికులు, రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఎంపీ రవిచంద్ర చెప్పారు. ప్రభుత్వం ఫీజుల బకాయిలు చెల్లించని కారణంగా కాలేజీలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, ఓవర్సీస్ స్కాలర్ షిప్స్ బకాయిలు కూడా పెరిగిపోతున్నాయని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలంటూ యువత పోరుబాట పట్టారన్నారు. గోదావరి నీళ్లను సద్వినియోగంలోకి తేకుండా వృధాగా సముద్రం పాలవుతుంటే రేవంత్ రెడ్డి నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ఎంపీ రవిచంద్ర మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ఎన్నికలకు 432 హామీలిచ్చి,6 గ్యారంటీలు ప్రకటించి భద్రాచలం రాముల వారితో సహా కనబడ్డ ప్రతి దేవుని మీద ఒట్లేసి, అబద్ధాలు చెప్పి, మోసం చేసి అధికారంలోకి వచ్చారని ఎంపీ వద్దిరాజు విమర్శించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు 56వేల కోట్ల రాష్ట్ర బడ్జెట్ ను 3కోట్ల దాక తీసుకుపోయి అన్ని విధాలా అభివృద్ధి చేస్తే, కాంగ్రెస్ పాలకులు ఆగం పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఫీజుల బకాయిలను విడతల వారీగా చెల్లించాలని,లేనట్టయితే బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక చెల్లిస్తుందని ఎంపీ వద్దిరాజు హామీనిచ్చారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ దిండిగల రాజేందర్, మునిసిపల్ మాజీ ఛైర్ పర్సన్ కాపు సీతామహాలక్ష్మి,మాజీ వైస్ ఛైర్మన్ వేల్పుల దామోదర్, రాజు గౌడ్,అనుదీప్,నవతన్,వగ్గెల పూజ, జగడం కిరణ్, రమాకాంత్, కన్నిలతో పాటు పలు విద్యార్థి, యువజన,ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## బిజినెస్

### ఉద్యోగాలు ఊడుతాయంటే
### ఏఐ విజయం ఎవరికి కావాలి : సత్య నాదెళ్ల



కృత్రిమ మేథపై ప్రజల్లో నమ్మకం తగ్గిపోవడానికి ప్రధాన కారణం ఉద్యోగాలు పోతాయనే భయమేనని మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల అన్నారు. ఒక పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన ఆయన.. ఏఐవల్ల నాలెడ్జ్ ఆధారిత ఉద్యోగాలన్నీ పోతాయని ఒకవైపు చెబుతారని, మరోవైపు అదే టెక్నాలజీని అభివృద్ధి చేస్తున్నామని గర్వంగా ప్రకటిస్తున్నారని అన్నారు. ఉద్యోగాలే పోతాయంటే ఏఐ విజయాన్ని ఎవరు కోరుకుంటారని ప్రశ్నించారు. ఏఐ రంగం గురించి మాట్లాడుతున్న తీరువల్లే ప్రజల విశ్వాసం దెబ్బతిన్నదని నాదెళ్ల అభిప్రాయపడ్డారు. ఉద్యోగాలు కోల్పోతామనే ఆందోళన ప్రజల్లో బలపడిందని, అందుకే ఏఐపై అనుమానాలు పెరుగుతున్నాయని చెప్పారు. కాలేజీల్లో ఏఐ గురించి మాట్లాడితే వ్యతిరేక స్పందన రావడం కూడా ఈ పరిస్థితికి నిదర్శనమన్నారు. ప్రజల విశ్వాసాన్ని తిరిగి పొందాలంటే ఏఐవల్ల సమాజానికి ప్రత్యక్ష ప్రయోజనాలు కనిపించాల్సిన అవసరం ఉందని నాదెళ్ల సూచించారు. ఉదాహరణకు డేటా సెంటర్లు ఏర్పాటు చేస్తే స్థానిక ఉపాధి, పన్ను ఆదాయం, పాఠశాలలు, మౌలిక వసతుల వంటి రంగాలకు ఎలా మేలు జరుగుతుందో ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని నాదెళ్ల అన్నారు. ఏఐ మనుషుల ఉద్యోగాలను లాక్కోవడానికి కాకుండా కొత్త ఉద్యోగ అవకాశాలను సృష్టించడానికి ఉపయోగపడాలని ఆయన అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో ఏయే కొత్త ఉద్యోగాలు అవసరమవుతాయో గుర్తించడం, వాటికి తగిన వేతనాలు నిర్ణయించడంలో కూడా ఏఐ కీలకపాత్ర పోషించగలదని తెలిపారు.

### మెరిడియన్ స్పెషల్ ఎడిషన్.. కేవలం 85 మాత్రమే!




జీప్ ఇండియా.. మెరిడియన్ 85వ యానివెర్సరీ ఎడిషన్‌ను రూ.36.05 లక్షల (ఎక్స్-షోరూమ్) ధరతో లాంచ్ చేసింది. దీనికి కంపెనీ కేవలం 85 యూనిట్లకు మాత్రమే పరిమితం చేసింది. ఈ స్పెషల్ ఎడిషన్, టాప్ స్పెక్ ఓవర్‌ల్యాండ్ వేరియంట్ ఆధారంగా నిర్మితమైంది. ఇది చూడటానికి స్టాండర్డ్ మోడల్ మాదిరిగా అనిపించినప్పటికీ.. యానివర్సరీ ఎడిషన్‌లో కొన్ని కాస్మొటిక్ అప్డేట్స్ గమనించవచ్చు. ముందు డోర్లు, టెయిల్‌గేట్, వీల్ సెంటర్ క్యాప్స్‌పై 85వ వార్షికోత్సవ డీకాల్స్‌తో పాటు, గ్లాస్ బ్లాక్ 18-అంగుళాల అల్లాయ్ వీల్స్ పొందుతుంది. ఇది తెలుపు, మెటాలిక్ గ్రీన్, ఎరుపు, గ్రిజియో మాగ్నీషియో, నలుపు రంగులలో లభిస్తుంది. క్యాబిన్ మొత్తం నలుపు రంగు థీమ్‌తో ఉంటుంది. డాష్‌బోర్డ్ అంతటా మాయన్ గోల్డ్ ట్రిమ్, కాంట్రాస్ట్ డిటైలింగ్‌తో పాటు యాంబియంట్ లైటింగ్ కూడా ఉంటుంది. అయితే మెకానికల్‌గా ఎలాంటి మార్పులు చేయలేదు. కాబట్టి ఇది 168 ఎష్ట్రజూ పవర్, 350 చీఎ టార్క్ ఉత్పత్తి చేసే 2.0-లీటర్ టర్బో-డీజిల్ ఇంజన్‌తో కొనసాగుతుంది. 9-స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ ఉంటుంది.

# స్పేస్‌ఎక్స్ చరిత్రలో మరో మైలురాయి..
## హిందూ మహాసముద్రంలో సేఫ్ ల్యాండింగ్

అంతరిక్ష పరిశోధనా రంగంలో ప్రైవేట్ సంస్థ స్పేస్‌ఎక్స్ మరో చారిత్రక మైలురాయిని దాటింది. టెక్సాస్ లోని బోకా చిగా వద్దగల స్టార్‌బేస్ లాంచ్ ప్యాడ్ నుంచి ప్రయోగించిన "స్టార్‌షిప్ ఫ్లైట్-13 రోదసిలోకి విజయవంతంగా దూసుకెళ్లింది. భవిష్యత్తులో మానవులను చంద్రుడు, అంగారక గ్రహంపైకి తీసుకెళ్లేందుకు పూర్తిస్థాయి పునర్వినియోగ రాకెట్ వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు స్పేస్‌ఎక్స్ చేపట్టిన ఈ ప్రయోగం అంతరిక్ష చరిత్రలో ఎంతో కీలకమైనదిగా నిలిచింది. శనివారం ఉదయం నింగిలోకి లేచిన ఈ అత్యంత శక్తిమంతమైన రాకెట్.. నిర్ణీత సమయానికి అంతరిక్షంలోకి చేరుకుంది. ప్రయోగం ప్రారంభమైన రెండు నిమిషాల తర్వాత ప్రధాన రాకెట్ నుంచి బూస్టర్ విభాగం వేరైంది. అయితే తిరోగమన దిశలో గల్ఫ్ ఆఫ్ మెక్సికో సముద్రంలో ల్యాండ్ కావాల్సిన 'బూస్టర్-20' రాకెట్ ఇంజిన్ స్టార్టింగ్ సమస్యలవల్ల నియంత్రణ కోల్పోయి సముద్రంలో ల్యాండ్ కాకుండా దెబ్బతింది. మరోవైపు ప్రధాన వ్యోమనౌక (స్టార్‌షిప్-40) అంతరిక్షంలో ప్రయాణిస్తూ దాదాపు 20 నెక్స్ట్ జనరేషన్ 'స్టార్‌లింక్ వెర్షన్-3' ఇంటర్నెట్ ఉపగ్రహాలను విజయవంతంగా కక్ష్యలోకి విడుదల చేసింది.
అనంతరం ప్లాన్ చేసినట్లే గంటన్నర ప్రయాణం తర్వాత భూ వాతావరణంలోకి పునఃప్రవేశించి.. హిందూ మహాసముద్రంలో అత్యంత సురక్షితంగా నీటిపై పడి (సాఫ్ట్ స్ప్లాష్ డౌన్) తేలియాడింది. స్టార్‌షిప్ వ్యోమనౌక సముద్రంలో క్షేమంగా ల్యాండ్ కావడం ఇదే తొలిసారి కావడంతో "ఇది ఎంతో సంతోషకరమైన దృశ్యం" అని స్పేస్‌ఎక్స్ బృందం కొనియాడింది. సంస్థ అధినేత ఎలాన్ మస్క్ సామాజిక మాధ్యమాల వేదికగా హర్షం వ్యక్తంచేశారు.



# నా భార్య హాఫ్ ఇండియన్..
# నేను జాత్యహంకారిని కాదు : ఎలాన్ మస్క్

టెస్లా స్పేస్‌ఎక్స్ సీఈవో ఎలాన్ మస్క్ తనపై వస్తున్న జాతి వివక్ష ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. తాను జాత్యహంకారిని కాదని, తనపై వస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని చెప్పారు. 'ది ఎకానమిస్ట్ (ఒష్టవ జుఎశీఅశీఎఱర)' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రజలు మిమ్మల్ని జాత్యహంకారి అంటున్నారు కదా అని ఇంటర్వ్యూలో హోస్ట్ ప్రశ్నించగా.. మస్క్ తన వ్యక్తిగత జీవితాన్ని ఉదాహరణగా చూపిస్తూ సమాధానమిచ్చారు.
'నా జీవిత భాగస్వామి సగం భారతీయురాలు. ఆమెతో నాకు నలుగురు పిల్లలున్నారు. వారిలో ఒక కుమారుడికి ప్రఖ్యాత భారతీయ భౌతిక శాస్త్రవేత్త పేరు పెట్టాను. అలాంటప్పుడు నేను జాత్యహంకారిని ఎలా అవుతాను..?' అని మస్క్ ప్రశ్నించారు. మస్క్ భార్య శివోన్ జిలిస్ సగం భారతీయ మూలాలున్న కెనడియన్. వారి కుమారులలో ఒకరి పేరు మధ్యలో 'శేఖర్స ఉంటుంది. నోబెల్ గ్రహీత, భారత-అమెరికన్ భౌతిక శాస్త్రవేత్త సుబ్రహ్మణ్యన్ చంద్రశేఖర్ గౌరవార్థం ఈ పేరు పెట్టారు. శివోన్ జిలిస్.. మస్క్ స్థాపించిన న్యూరాలింక్ కంపెనీలో 2017 నుంచి కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అంతేకాకుండా తన కంపెనీలలో అన్ని జాతులకు చెందిన వారు ఉన్నత పదవుల్లో ఉన్నారని, అక్కడ ఎలాంటి జాత్యహంకారానికి తావులేదని చెప్పారు. విచిత్రం ఏమిటంటే జాతి వివక్ష ఆరోపణలు ఎదుర్కొంటున్న మస్క్.. స్వయంగా ప్రముఖ హాలీవుడ్ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్‌ను 'శ్వేతజాతి వ్యతిరేక జాత్యహంకారి' అని నిందించడం సంచలనం రేపుతోంది. ఇటీవల విడుదలైన నోలన్ తాజా చిత్రం 'ది ఒడిస్సీ' మూవీలో నటీనటుల ఎంపిక ఈ వివాదానికి కారణమైంది. ప్రఖ్యాత గ్రీకు ఇతిహాసం 'ది ఒడిస్సీ' లోని హెలెన్ ఆఫ్ ట్రాయ్ పాత్రకు నల్లజాతికి చెందిన ఆస్కార్ విజేత నటి లుపిటా యోంగోను ఎంపిక చేయడాన్ని మస్క్ తీవ్రంగా తప్పుబట్టారు. హోమర్ తన రచనలో హెలెన్ పాత్రను 'లేత చర్మం', 'బంగారు జుట్టు' కలిగిన యువతిగా వర్ణించాడని, దానికి విరుద్ధంగా నల్లజాతి నటిని ఎంపిక చేసి నోలన్ తన సమగ్రతను కోల్పోయారని, హోమర్ సమాధిపై అగౌరవం చూపారని మస్క్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' లో ఆరోపించారు.



# మెరిసిన ఇషాన్, అభిషేక్..
## అయ్యర్ సారథ్యంలో తొలి పొట్టి సిరీస్ కైవసం..!



వరసగా రెండు వైట్‌వాష్‌లను నుంచి తేరుకున్న భారత జట్టు అదిరే ఆటతో టీ20 సిరీస్ పట్టేసింది. జింబాబ్వేను చిత్తుగా ఓడించి మరో మ్యాచ్ ఉండగానే సిరీస్ కైవసం చేసుకుంది టీమిండియా. ఇషాన్ కిషన్(81), తిలక్ వర్మ(60 నాటౌట్) మెరుపులతో ప్రత్యర్థికి భారీ లక్ష్యాన్ని నిర్దేశించిన అయ్యర్ సేన 90 పరుగుల తేడాతో గెలిచింది. 220 పరుగుల ఛేదనలో జింబాబ్వే బ్యాటర్లను ప్రిన్స్ యాదవ్(2-10), అభిషేక్ శర్మ(3-17)లు బెంబేలెత్తించారు. సమిష్టి వైఫల్యంతో ఏమాత్రం పోటీ ఇవ్వలేకపోయిన ఆఫ్రికా జట్టు మరో ఓటమి చవిచూసింది. పొట్టి క్రికెట్‌లో మళ్లీ ఫామ్ అందుకున్న భారత జట్టు టీ20 సిరీస్‌ను కొల్లగొట్టింది. తొలి మ్యాచ్‌లో 7 వికెట్లతో గెలిచిన టీమిండియా రెండో టీ20లోనూ జింబాబ్వేను వణికించింది. రికార్డు స్థాయిలో 52వ సారి రెండొందలకు పైగా కొట్టిన భారత్.. ప్రత్యర్థిని పరిమితం చేసింది. టాపార్డర్ విఫలమైనా బ్యాటుతో రెచ్చిపోయిన ఇషాన్ కిషన్(81), తిలక్ వర్మ(60 నాటౌట్)లు భారీ స్కోరొందించగా.. అనంతరం ప్రిన్స్ యాదవ్(2-10), అభిషేక్ శర్మ(3-17)లు వికెట్ల వేటతో చెలరేగారు. బ్యాటుతో విఫలమైన అభిషేక్.. మూడు వికెట్లు తీయడంతో జింబాబ్వే 129కే ఆలౌటైంది. 90 పరుగుల తేడాతో గెలుపొందిన టీమిండియా మరో మ్యాచ్ ఉండగానే సిరీస్‌ను ఒడిసిపట్టింది. టీమిండియా నిర్దేశించిన 220 పరుగుల భారీ ఛేదనను జింబాబ్వే దూకుడుగా మొదలెట్టింది. ఓపెనర్లు బెన్నెట్(32), బెన్ కరన్(1)లు దూకుడుగా ఆడినా.. అరంగేట్ర పేసర్ యశ్ ఠాకూర్() తొలి దెబ్బ కొట్టాడు. దంచేస్తున్న బెన్నెట్‌ను ఔట్ చేసి బ్రేకివ్వగా.. ఆ తర్వాతి ఓవర్లోనే కరన్‌ను ప్రిన్స్ యాదవ్(2-10) పెవిలియన్ పంపాడు. బిష్ణోయ్ బౌలింగ్‌లో డియాన్ మైర్స్(12) బౌల్డవ్వగా 58 వద్ద ఆతిథ్య జట్టు మూడో వికెట్ పడింది. కష్టాల్లో పడిన జట్టును ఆదుకోవాలనుకున్న కెప్టెన్ సికిందర్ రజా(0)ను ప్రిన్స్ డకౌట్‌గా వెనక్కి పంపి జింబాబ్వేను మరింత కష్టాల్లోకి నెట్టాడు. దూబే ఓవర్లో మద్వేరా(2) అయ్యర్ చేతికి చిక్కడంతో ప్రత్యర్థి ఓటమిని ఖాయమైంది. రియాన్ బర్ల్(20)ను తిలక్ ఔట్ చేయడంతో టీమిండియా విజయం మరింత తేలికైంది. బ్యాటుతో తేలిపోయిన అభిషేక్(3-17) బంతితో రాణించగా జింబాబ్వే 129 పరుగులకే కుప్పకూలింది.

**ఇషాన్, తిలక్ విధ్వంసం**



హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో టాస్ ఓడిన భారత జట్టుకు శుభారంభం దక్కలేదు. విధ్వంసక ఓపెనర్ అభిషేక్ శర్మ(8) ఈసారి కూడా నిరాశపరిచాడు. తొలి ఓవర్లోనే రెండు ఫోర్లు కొట్టిన అతడిని ముజరబని పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాత 3 ఫోర్లు, ఒక సిక్సర్‌తో రెచ్చిపోయిన వైభవ్ సూర్యవంశీ(20) జింబాబ్వే బౌలర్లను భయపెట్టాడు. కానీ, అదే ఊపులో ఆడబోయి అతడు వికెట్ సమర్పించుకున్నాడు.
29కే రెండు వికెట్లు పడిన వేళ.. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(25), ఇషాన్ కిషన్(81)లు దూకుడుగా ఆడి స్కోర్‌బోర్డును ఉరికించారు. తిలక్ 23 బంతుల్లోనే హాఫ్ సెంచరీ అందుకోగా రింకూ సింగ్(12) విఫలమయ్యాడు. ఇషాన్, తిలక్ విధ్వంసంతో నిర్ణీత ఓవర్లలో టీమిండియా 5 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. జింబాబ్వే బౌలర్లలో ముజరబని, నగవరా, ఎవాన్స్, న్యూమన్, బెన్నెట్‌లు తలా ఒక వికెట్ తీశారు.


## స్పోర్ట్స్

### మళ్లీ తస్సుమన్న అభిషేక్..
### వైభవ్ ధాటిగా ఆడినా..!



టీమిండియా డాషింగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ వైఫల్యాల పరంపర కొనసాగుతోంది. వరుసగా ఐదో మ్యాచ్‌లో అతడు నిరాశపరిచాడు. చివరిగా ఇంగ్లండ్‌తో తొలి టీ20లో అర్ధ సెంచరీ చేసిన అతడు.. ఆతర్వాత వరుసగా 43, 10, 16, 3, 1 పరుగుకు ఔటయ్యాడు. ఇవాళ (జులై 25) జింబాబ్వేతో జరుగుతున్న రెండో టీ20లో ఓ మోస్తరు స్టార్ట్?? లభించినప్పటికీ సద్వినియోగం చేసుకోలేక వికెట్ పారేసుకున్నాడు. 8 బంతుల్లో 2 ఫోర్ల సాయంతో 8 పరుగులు చేసి బ్లెస్సింగ్ ముజరబానీ బౌలింగ్‌లో ర్యాన్ బర్ల్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరాడు. అభిషేక్ త్వరగా ఔట్ కావడంతో రెండో టీ20లో భారత్ ఆదిలోనే ఒత్తిడిలో పడినట్లైంది. అతడు ఔటైన వెంటనే మరో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ కూడా ఔటయ్యాడు. తొలి మ్యాచ్ ఫామ్‌ను కొనసాగించిన వైభవ్ భారీ ఇన్నింగ్స్ ఆడతాడని భావిస్తే.. 9 బంతుల్లో 3 ఫోర్లు, సిక్సర్ సాయంతో 20 పరుగులు చేసి పెవిలియన్ బాట పట్టాడు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ 29 పరుగులకే ఓపెనర్లిద్దరి వికెట్లు కోల్పోవడంతో కష్టాల్లో పడింది. ఇషాన్ కిషన్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ క్రీజ్‌లో ఉన్నారు. కాగా, ఈ మ్యాచ్ కోసం భారత్ రెండు మార్పులు చేసింది. అశోక్ కుమార్ స్థానంలో యశ్ ఠాకూర్ తుది జట్టులోకి వచ్చాడు. యశ్ ఠాకూర్‌కు ఇది తొలి టీ20 మ్యాచ్. కెప్టెన్ అయ్యాక వరుసగా ఏడు టాస్‌లు గెలిచిన శ్రేయస్ ఎట్టకేలకు ఎనిమిదో మ్యాచ్‌లో టాస్ ఓడాడు. 3 మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో భారత్ తొలి మ్యాచ్ గెలిచి 1-0 ఆధిక్యంలో కొనసాగుతున్న విషయం తెలిసిందే.

నవగీతం
తెలుగు దినపత్రిక
ఆదివారం
26 జూలై 2026




# జెట్ స్పీడ్.. నెల రోజుల్లోపే 'ది ప్యారడైస్' విలన్ సినిమా కంప్లీట్..!

కిల్ సినిమాతో సూపర్ పాపులారిటీ సంపాదించాడు రాఘవ్ జుయల్. ఈ టాలెంటెడ్ యాక్టర్ న్యాచురల్ స్టార్ నాని నటిస్తోన్న ది ప్యారడైస్‌లో విలన్‌గా కనిపించబోతున్నాడని తెలిసిందే. అయితే ఈ మూవీ కంటే ముందు రాఘవ్ జుయల్ హిందీ ప్రాజెక్ట్ 'భాయ్ తేరా స్టార్ హై' సినిమాలో హీరోగా కనిపించబోతున్నాడు. ఈ మూవీలో పాపులర్ డిజిటల్ కంటెంట్ క్రియేటర్ నిహారిక ఎన్‌ఎం ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. కాగా బాలీవుడ్ హంగామాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో డైరెక్టర్ కమ్ ప్రొడ్యూసర్ వివేక్ అగర్వాల్ ఆసక్తికర విషయం ఒకటి షేర్ చేసుకున్నారు. రాఘవ్ జుయల్ హీరోగా నటించిన భాయ్ తేరా స్టార్ హై సినిమాను కేవలం నెలలోపై షూట్ చేశారట. సినిమా మొదలవ్వగానే విస్తృతమైన వర్క్‌షాప్‌లను నిర్వహించామని.. ప్రతీ ఒక్క యాక్టర్ తమ లైన్స్‌ను ముందస్తుగానే నేర్చుకుని ప్రిపేర్ అవడం వల్లే సినిమా షూటింగ్‌ను త్వరగా పూర్తి చేసే అవకాశం దొరికిందని అన్నాడు. తాను ఓ పెద్ద సూపర్‌స్టార్ అవుతానని భ్రమల్లో బతికే ఒక యాక్టర్ చుట్టూ తిరిగే కథాంశంతో తెరకెక్కుతోంది 'భాయ్ తేరా స్టార్ హై'. కానీ అతడు మాత్రం ఓ బ్యాడ్ నటుడిగా ఉండిపోతాడు. సంజయ్ కపూర్ ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తున్నాడు. వచ్చే వారం ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ది ప్యారడైస్ సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇస్తుండటం.. అది కూడా నానితో ఫైట్ చేయబోతుండటంతో అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి.

# 'ఆదర్శ కుటుంబం'లో పోలీస్‌గా నారా రోహిత్..

**బర్త్‌డే సందర్భంగా పవర్‌ఫుల్ ఫస్ట్ లుక్ విడుదల**




టాలీవుడ్‌లో మోస్ట్ లవబుల్ హీరోగా గుర్తింపు పొందిన విక్టరీ వెంకటేష్ ప్రధాన పాత్రలో, శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'ఆదర్శ కుటుంబం'. పూర్తి స్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. హారికా అండ్ హాసిని క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో నారా రోహిత్ కీలక పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. నేడు (జూలై 25) నారా రోహిత్ పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో రోహిత్ ఎంతో స్టైలిష్, డైనమిక్ లుక్‌లో కనిపిస్తూ అభిమానులను ఆకట్టుకుంటున్నారు. ముఖ్యంగా పోస్టర్ బ్యాక్‌గ్రౌండ్‌లో కనిపించిన తెలంగాణ పోలీస్ బోర్డు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ పోస్టర్‌తో నారా రోహిత్ ఈ సినిమాలో పోలీస్ అధికారిగా నటిస్తున్న విషయం దాదాపు ఖరారైంది. ఆయన పాత్ర సాధారణ పోలీస్ పాత్ర కాకుండా, మాస్ అప్పీల్‌తో పాటు కథను కీలక మలుపు తిప్పే శక్తివంతమైన అధికారిగా ఉండబోతుందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. చాలా కాలం తర్వాత రోహిత్ మరోసారి యూనిఫామ్‌లో కనిపించబోతుండటంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది.ఇప్పటికే వెంకటేష్, త్రివిక్రమ్ కాంబినేషన్‌పై భారీ అంచనాలు ఉన్నాయి. కుటుంబ భావోద్వేగాలు, వినోదం, యాక్షన్ అంశాలను సమపాళ్లలో మేళవిస్తూ త్రివిక్రమ్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. వెంకటేష్ తనదైన కామెడీ టైమింగ్, ఎమోషనల్ పెర్ఫార్మెన్స్‌తో ప్రేక్షకులను అలరించనున్నారని సమాచారం. ఈ చిత్రానికి స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్. థమన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే ఆయన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటలపై భారీ అంచనాలు ఉన్నాయి. అత్యున్నత నిర్మాణ విలువలతో హారికా అండ్ హాసిని క్రియేషన్స్ ఈ సినిమాను నిర్మిస్తోంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి 'ఆదర్శ కుటుంబం' చిత్రాన్ని ఈ ఏడాది అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. వెంకటేష్, త్రివిక్రమ్ కాంబినేషన్‌తో పాటు నారా రోహిత్ పవర్‌ఫుల్ పోలీస్ పాత్ర కూడా ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుందని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# కొత్త కాంబినేషన్?



ఓ వైపు కమర్షియల్ సినిమాల్లో హీరోయిన్‌గా, మరోవైపు లేడీ ఓరియంటెడ్ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు రష్మిక మందన్నా. మరోవైపు ఇటు సినిమాలు అటు ఓటీటీ ప్రాజెక్ట్స్‌తో తమకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకులు రాజ్ నిడిమోరు (రాజ్), కృష్ణ దాసరి (డీకే). వీరిద్దరూ తాజాగా రష్మిక కోసం ఓ పవర్‌ఫుల్ కథని సిద్ధం చేస్తున్నారట. కాగా ఇటీవలే రాజ్ నిడిమోరు అందించిన కథతో సమంత లీడ్ రోల్‌లో రూపొందిన 'మా ఇంటి బంగారం' సినిమా సూపర్ హిట్ కావడంతో పాటు రూ. 100 కోట్లు వసూళ్లు సాధించిన సంగతి తెలిసిందే. అందం, అభినయంతో పాన్ ఇండియా స్థాయిలో తనకంటూ అభిమానులను సం పాదించుకున్న రష్మికతో ఇప్పుడు ఓ సినిమా ప్లాన్ చేస్తున్నారట రాజ్ అండ్ డీకే. ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన కథా చర్చలు ఆరంభంలో ఉన్నాయని సమాచారం. రష్మిక ఇమేజ్‌ని దృష్టిలో పెట్టుకుని పూర్తి స్క్రిప్ట్ రెడీ చేసిన తర్వాత ఆమెను కలిసి వినిపించనున్నారట రాజ్--డీకే. మరి... వార్తల్లో ఉన్నట్లు ఈ కొత్త కాంబినేషన్ కుదురుతుందా? అనేది వేచి చూడాల్సిందే.

# 'రామాయణ'కు రికార్డు స్థాయి ప్రమోషన్స్? ప్రచారానికే రూ.375 కోట్ల ఖర్చు చేస్తున్నారా..!



భారతీయ సినీ చరిత్రలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న మైథలాజికల్ చిత్రం రామాయణ'పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. బాలీవుడ్ దర్శకుడు నితీష్ తివారీ రూపొందిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్ రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుంది. దాదాపు రూ. 4,000 కోట్ల వ్యయంతో రూపొందుతున్న ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయి పల్లవి సీతాదేవిగా, యష్ రావణుడి పాత్రలో నటిస్తున్నారు. మొదటి భాగాన్ని ఈ ఏడాది దీపావళి సందర్భంగా విడుదల చేయాలని, రెండో భాగాన్ని వచ్చే ఏడాది దీపావళికి ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్ర బృందం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ నేపథ్యంలో సినిమా ప్రమోషన్స్‌కు సంబంధించిన ఓ వార్త ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న అధికారిక ట్రైలర్ జూలై 24న విడుదల కావాల్సి ఉన్నప్పటికీ, అది అనూహ్యంగా వాయిదా పడింది. ఈ నిర్ణయం వెనుక హాలీవుడ్ దిగ్గజ సంస్థ సోనీ పిక్చర్స్ ప్రపంచవ్యాప్త పంపిణీ హక్కులను దక్కించుకోవడమే ప్రధాన కారణమని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.అంతర్జాతీయ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని హాలీవుడ్ స్థాయిలో గ్రాండ్ మార్కెటింగ్ క్యాంపెయిన్ రూపొందిస్తున్న నేపథ్యంలో, కొత్త ప్రమోషనల్ ప్లాన్‌కు అనుగుణంగా ట్రైలర్ విడుదల తేదీని మార్చినట్లు తెలుస్తోంది. అయితే దీనిపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న సమాచారం ప్రకారం, విదేశీ మార్కెటింగ్ కోసం సోనీ పిక్చర్స్ దాదాపు రూ. 235 కోట్లు, భారతీయ నిర్మాతలు మరో రూ. 140 కోట్లు ఖర్చు చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. మొత్తంగా ప్రచారం, గ్లోబల్ మార్కెటింగ్ కోసం సుమారు రూ. 375 కోట్ల బడ్జెట్ కేటాయించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి.ఈ సమాచారం అధికారికంగా ధృవీకరించబడనప్పటికీ, ఒకవేళ ఇదే నిజమైతే భారతీయ సినిమా చరిత్రలో ప్రమోషన్స్ కోసం ఇంత భారీ మొత్తం కేటాయించిన తొలి చిత్రంగా 'రామాయణ' రికార్డు సృష్టించే అవకాశం ఉంది. ఈ చిత్రానికి ఆస్కార్ విజేతలు హాన్స్ జిమ్మర్, ఏ.ఆర్. రెహమాన్ కలిసి సంగీతం అందిస్తుండటం ప్రత్యేక ఆకర్షణగా మారింది. అత్యాధునిక ఐమాక్స్ ఫార్మాట్, ప్రపంచ స్థాయి విజువల్ ఎఫెక్ట్స్, భారీ ప్రొడక్షన్ డిజైన్‌తో ఈ చిత్రాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రూపొందిస్తున్నారు..



# నాపై ఒత్తిడి ఉండటం మంచిదే!: జై కృష్ణ

"నేను ఫ్యాన్స్‌కి ఇంకా ఏమీ ఇవ్వలేదు. అయినప్పటికీ వాళ్లు నాపై ఎంతో ప్రేమ చూపిస్తున్నారు. నేనీ సినిమా చేస్తున్నానని తెలియక ముందు నుంచే ఘట్టమనేని అభిమానులు నన్ను స పోర్ట్ చేశారు. అందుకే నటుడిగా వాళ్ల నమ్మకాన్ని నిలబెట్టాలి... నటుడిగా నన్ను నేను నిరూపించుకోవాలి. మంచి కథలు, మంచి పాత్రలు చేయాలనే ఆలోచన నాకు మొదట్నుంచే ఉంది. ఈ విషయంలో నాపై ఒత్తిడి ఉండటం మంచిదే. అది నన్ను మంచి కథల వైపు తీసుకువెళ్తుంది" అని జై కృష్ణ అన్నారు. సూపర్‌స్టార్ కృష్ణ మనవడు, మహేశ్‌బాబు సోదరుడు రమేష్‌బాబు కుమారుడు జై కృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయం అవుతున్న సినిమా 'శ్రీనివాస మంగాపురం'. రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని హీరోయిన్‌గా పరిచయం అవుతున్న ఈ సినిమాకు అజయ్ భూపతి దర్శకత్వం వహిం చారు. అశ్వినీదత్ సమర్పణలో పి. కిరణ్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 30న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా శనివారం విలేకరులతో జై కృష్ణ చెప్పిన సంగతులు...

**నా 16 ఏళ్ల వయసులో యాక్టర్ కావాలని నిర్ణయించుకున్నాను.**

ఆ తర్వాత శిక్షణ తీసుకోవడం ప్రారంభించాను. రెండేళ్లు ముంబై, తర్వాత పాండిచ్చేరి, నెక్ట్స్ న్యూయార్క్ వెళ్లి యాక్టింగ్‌లో శిక్షణ తీసుకున్నాను. ఆ తర్వాత ఇండియా వచ్చి కథలు వినడం ప్రారంభించాను. కొన్ని కథలు విన్న తర్వాత, నిర్మాత పి. కిరణ్‌గారి ద్వారా దర్శకుడు అజయ్ భూపతిగారిని కలిశాను. అజయ్‌గారు చెప్పి కథ నచ్చడంతో, 'శ్రీనివాస మంగాపురం' సినిమా చేశాను. మంచి క్యారెక్టరైజేషన్, మంచి ఎమోషన్‌తో కూడిన కథతో ప్రేక్షకుల ముందుకు రావాలనుకున్నాను. నేను అనుకున్న అంశాలు ఈ కథలో కుదిరాయి. ఈ చిత్రం కోసం అజయ్‌గారు 3 నెలలు వర్క్‌షాప్ చేయించారు. లుక్ టెస్ట్, స్క్రీన్ టెస్ట్, డైలాగ్స్... ఇవన్నీ ముందుగానే ప్రిపేర్ అయ్యాం.

ఇందులో నేను శ్రీను అనే రోల్ చేశాను. శ్రీనుకి కాస్త అల్లరితనం ఉంటుంది. కానీ తనకేం కావాలో తనకి స్పష్టంగా తెలుసు. తను మంగను (రాషా తడానీ) ప్రేమిస్తాడు. ఆ తర్వాత కథ ఎలా సాగుతుంది? అన్నదే మిగిలిన సినిమా కథాంశం. ఇది రెగ్యులర్ లవ్‌స్టోరీ సినిమా కాదు. ఈ చిత్రంలో బలమైన భావోద్వేగాలు ఉన్నాయి. ట్విస్ట్‌లు కొత్తగా ఉంటాయి. అజయ్‌గారు క్లారిటీ ఉన్న దర్శకుడు. అశ్వినీదత్‌గారితో నాకు మంచి అనుబంధం ఉంది. వైజయంతి మూవీస్‌లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థలో లాంచ్ కావడం హ్యాపీగా ఉంది. బాబాయ్ (మహేశ్‌బాబు) తొలి సినిమా కూడా ఈ బ్యానర్‌లోనే రూపొందింది. నాకు ఫ్యామిలీ స పోర్ట్ ఉంది. నా ప్రతి అడుగులో బంగారు తాతయ్య (కృష్ణ సోదరుడు--నిర్మాత ఆదిశేషగిరి రావు) ?ర పోత్సాహం ఉంది. నేను సినిమాల్లోకి రావాలని, మంచి నటుడిగా ఎదగాలని మా తాతయ్య (కృష్ణ)గారు కోరుకున్నారు. మా నాన్నగారు ఉన్నప్పుడు సినిమాల గురించి చర్చించుకునేవాళ్లం. నేను యాక్టర్ కావాలనుకున్న తర్వాత బాబాయ్ సలహాలు, సూచనలు ఇచ్చారు. దర్శకుడు విజన్‌కు తగ్గట్లు యాక్ట్ చేయాలని చె??పారు. అలాగే 'శ్రీనివాస మంగాపురం' చూసి, హ్యాపీ ఫీలయ్యారు. ఈ సినిమా ఆయనకు నచ్చింది. యాక్షన్ సీక్వెన్స్‌లు, సాంగ్స్ చాలా నచ్చాయని చె??పారు. స్క్రీన్‌పై డిఫరెంట్‌గా కనిపిస్తున్నావని, క్యారెక్టర్‌లోకి పూర్తిగా వెళ్లి పోయావని చెపారు. నా చిన్నతనంలో నేను సినిమా వాతావరణానికి దూరంగా ఉండి చదువుకునేవాడిని. మొదటిసారి 'నిజం' సినిమా షూటింగ్‌కు వెళ్లాను. ఇందులో చైల్డ్ క్యారెక్టర్ చేశాను. ఆ తర్వాత 'అర్జున్' షూటింగ్‌కు వెళ్లాను. ఈ చిత్రానికి మా నాన్నగారు నిర్మాత. 'గుంటూరు కారం' షూటింగ్‌కు వెళ్లాను. ఒక యాక్టర్‌గా నాకు విభిన్న జానర్స్‌లో సినిమాలు చేయాలని ఉంది. కానీ యాక్షన్ సినిమాలు చేయడం ఎక్కువ ఇష్టం. నేను యాక్టర్‌ని కావాలనుకున్నప్పుడే మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకున్నాను.

Printed Published, Owned by PEMBI MAHENDHAR Printed at Saketh Publications, 312. Trinetra Complex, Sangareddy, Telangana 502001.
Published from 11-65/49, PEDDAMMAWADA, MALLAPUR, JAGITIAL, TELANGANA - 505331. PH: 9912484184.
Email : navageetamnews@gmail.com PRGI.NO:TGTEL/26/A2002. EDITOR: PEMBI MAHENDHAR.